


Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 134 | బుధవారం 22 అక్టోబర్ 2025 | పేజీలు : 08 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## టారిఫ్‌లతో గ్లోబల్ కంపెనీలకు దెబ్బ

### - రెండేండ్లలో రూ.3 లక్షల కోట్ల నష్టం



**హైదరాబాద్- సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై విధించిన అధిక సుంకాలు గ్లోబల్ కార్పొరేట్ కంపెనీలను బెంబేలెత్తుస్తున్నాయి. ఆదాయాలు భారీగా దెబ్బతినవచ్చని రిపోర్టులు వస్తోన్నాయి. అమెరికా సుంకాల వల్ల గ్లోబల్ కంపెనీలు 35 బిలియన్ డాలర్ల (రూ.3 లక్షల కోట్లు) పైగా అదనపు వ్యయాలు ఎదుర్కొన్నాయని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో అంచనా వేసింది. ఇది ఆ కంపెనీలకు నష్టంగా మారొచ్చని విశ్లేషించింది. అయితే.. డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాల నుండి కొత్త వాణిజ్య ఒప్పందాలు కొంత ఉపశమనం కల్పించనున్నాయని పేర్కొంది. ట్రంప్ వాణిజ్య యుద్ధం యుఎస్ సుంకాలను 1930ల నాటి గరిష్ట స్థాయికి తీసుకెళ్లాయి. దీంతో కంపెనీలు తమ ఖర్చు అంచనాలను తగ్గించాయి. మరోవైపు ధరల పెంపు వంటి ప్రణాళికలు రూపొందించాయి.

- మిగతా 2లో..

## డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు మార్కెటింగ్

### - సమీక్షలో సిఎం చంద్రబాబునాయుడు



**అమరావతి-సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్ని రంగాల్లో అవకాశాలు ఉంటే అన్ని రంగాలనూ ఉపయోగించుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. సెర్ప్, మెప్మా విభాగాలపై మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ఏర్పాటు తరువాత వాళ్లలో చైతన్యం వచ్చిందన్నారు. ప్రస్తుతం మహిళా సంఘాలు రూ.20,739 కోట్లను పొదుపు చేస్తున్నాయన్నారు. డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో బ్రాండింగ్ రావాలని, వారి టాలెంట్‌ను గుర్తించడం, స్థానికంగా ఉండే వనరులను సద్వినియోగం చేసుకోవడం, టెక్నాలజీని ఉపయోగించుకోవడం వంటి

- మిగతా 2లో..

## జనజీవనస్రవంతిలో కలవండి



- మావోయిస్టులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- ప్రజాస్వామ్యయుతంగా పనులు చేసుకోవాలని సూచన
- బలిమెలలో మరణించిన 32 మంది పోలీసులకు 200 గజాల స్థలం
- గోషామహల్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ సభ

**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి తాము సాధించాలనుకున్న పనులను ప్రజాస్వామ్య యుతంగా సాధించుకోవాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గోషామహల్ పోలీస్‌స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ (బ్లాక్ డే) సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మావోయిస్టులు అనుసరిస్తున్న మార్గానికి భవిష్యత్ లేదనీ, ఇప్పటికే అగ్రనేతలు కొందరు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారని తెలిపారు. మిగతావారు కూడా ఆ బాటలో నడిచి ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో తమ భవిష్యత్‌ను నిర్మించుకోవాలని సూచించారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు 191 మంది పోలీసులు విధి నిర్వహణలో అమరుల



య్యారనీ, రాష్ట్రానికి చెందిన ఎస్సై బానోత్ జవహర్‌తో పాటు కానిస్టేబుళ్లు సందీప్, శ్రీధర్, పవన్‌కళ్యాణ్, సైదులు, ప్రమోద్‌లు అమరుల య్యారనీ, వారి త్యాగాలు ఎనలేనివని ఆయన కొనియాడారు. వారికి శ్రద్ధాంజలి ఘటించారు. విధి నిర్వహణలో మరణించిన కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై వరకు కోటి రూపాయలు, ఎస్సై నుంచి సీఐ వరకు రూ.1.20 కోట్లు, డీఎస్పీ నుంచి అడిషనల్ ఎస్పీ వరకు రూ.1.50 కోట్లు, ఎస్పీ నుంచి ఆ పైస్థాయి వరకు

- మిగతా 2లో..

## విశాఖ ఉక్కులో మరో 500 మందిపై వేటు

- కేంద్ర ప్రభుత్వ షరతుల్లో భాగంగానే
- నోరు మెదపని కూటమి పార్టీలు




- మిగతా 2లో..

**విశాఖ-సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** వెలుగుల పండగ దీపావళికి దేశ వ్యాప్తంగా ప్రజానీకం సిద్ధమౌతున్న వేళ విశాఖ స్టీలు ప్లాంటులో భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. పండగకు కొన్ని గంటలముందు ఉక్కు యాజమాన్యం తీసుకున్న నిర్ణయం కార్మికుల బతుకుల్లో చీకట్లు నింపింది. ఒకరు, ఇద్దరు కాదు. ఏకంగా 500 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుండి తొలగిస్తున్నట్లు యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులు ఒక్కసారిగా కలకలం రేపాయి. కేంద్ర ప్రభుత్వ

## ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** దేశ రాజధాని ఢిల్లీని వాయు కాలుష్యం కమ్మేసింది. గత ఆరు రోజులుగా వాయు కాలుష్యం ప్రమాద స్థాయిలో కొనసాగుతోంది. దీపావళి వేడుకల తర్వాత వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయికి చేరింది. మంగళవారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) 451 పాయింట్లతో నమోదైంది. ఎన్‌సిఆర్ పరిధిలో మొత్తం 38 ఎయిర్ మానిటరింగ్ స్టేషన్లు ఉండగా%ా% దాదాపు 36 పాయింట్లలో వెరీ పూర్ కేటగిరితో రెడ్ జోన్‌ను చూపించాయి. వజీర్‌పూర్ 423, ద్వారకా 417, అశోక్ విహార్ 404, ఆనంద్ విహార్‌లో 404 ఎక్యూఐ నమోదైంది. పటేల్ నగర్,

- ఎన్‌సిఆర్ పరిధిలో క్షీణించిన గాలి నాణ్యత
- దీపావళి వేడుకల తరువాత రెడ్ జోన్‌లోకి 36 పాయింట్లు
- అవసరమైతేనే బయటకు రావాలని నిపుణుల సూచన

- మిగతా 2లో..

## 2027 ఫిబ్రవరి లోగా..

- డిఎ బకాయిలపై సర్కారు తాజా ఉత్తర్వులు
- ఉద్యోగుల ఆగ్రహంతో 'రిటైర్మెంటు' జిఓ నుండి వెనకడుగు




**అమరావతి-సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ఉద్యోగుల్లో వ్యక్తమైన తీవ్ర ఆగ్రహంతో డిఎ బకాయిలకు రిటైర్మెంట్‌కు ముడిపెడుతూ జారీ చేసిన ఉత్తర్వుల నుండి రాష్ట్ర ప్రభుత్వం వెనకడుగు వేసింది. ఏకపక్షంగా జారీ చేసిన ఆ ఉత్తర్వుల స్థానంలో 2027 ఫిబ్రవరిలోగా డిఎ బకాయిలను చెల్లిస్తామంటూ తాజాగా జిఓ జారీ చేసిది. ఈ మేరకు మంగళవారం రాత్రి 62వ నెంబర్ జిఓను ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ విడుదల చేశారు. 2024 జనవరి 1 నుంచి ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ వరకూ డిఎ బకాయిలను 2027 ఫిబ్రవరిలోపు 4 వాయిదాల్లో చెల్లించనున్నట్లు తాజా జిఓలో పేర్కొన్నారు.

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## కాలిన.. కాలుష్యం!

**(కాకినాడ-సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** దీపావళి అంటే సందడే సందడి. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటారు. ఈ దీపావళి పండగకు ఉమ్మడి జిల్లాలో బాణ సం చా మోతమోగింది. జువ్వలు, బాంబులు, చిచ్చుబుడ్లు, లక్ష్మీ టపాసులు పేలాయి. రంగు రంగుల మందు గుండు నిప్పులు చిమ్ముతూ పొగలుకక్కాయి. పండగ



సంతో షంతో జనం ఎక్కడికక్కడ మందుగుండు భారీగా పేల్చారు.

- మిగతా 2లో..

- ప్రమాదకర స్థాయికి చేరిక
- అమలాపురాన ఏక్యూఐ 243
- రాజమహేంద్రవరంలో 212
- కాకినాడ నగరంలో 174
- 100 దాటితే శ్వాస ఆడదు

## గాజా ఒప్పందానికి ఇజ్రాయిల్ తూట్లు



**హైదరాబాద్-సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి పది రోజులు గడిచినా ఇంకా గాజాలో ఇజ్రాయిల్ మిలటరీ దారుణాలు కొనసాగుతున్నాయి. గత 24 గంటల్లో 13 మృత దేహాలు వివిధ ఆస్పత్రులకు వచ్చాయి.

- కొనసాగుతున్న వైమానిక దాడులు, కాల్పులు24గంటల్లో 13మంది మృతి
- నెతన్యాహూతో అమెరికా ప్రతినిధుల భేటీ

- మిగతా 2లో..

# డ్వాక్రా, మెప్మా ఉత్పత్తులకు మార్కెటింగ్

(మొదటిపేజీ తరువాయి)

అంశాల ద్వారా వారి అభివృద్ధికి తోడ్పాటు అందించాలని చెప్పారు. అరకు కాఫీ, మిల్లెట్లు ఈ రెండిటి కాంబినేషన్లో అవుట్‌లెట్లు ఏర్పాటుచేసే ఆలోచన చేయాలన్నారు. మహారాష్ట్ర బ్యాంబూ మిషన్ పాలసీ తెచ్చిందని, దానిపై అధ్యయనం చేయాలని సూచించారు. సీడ్‌కల్చర్, గుర్రపుడెక్కతో ఉత్పత్తులు చేయొచ్చని పేర్కొన్నారు. ఎగ్‌కార్ట్, ఆక్వా కార్ట్, మిల్లెట్‌కార్ట్ వంటి వి ప్రయోగాత్మకంగా చేపట్టాలని కోరారు. డ్వాక్రా సంఘాల్లోనూ పిహెచ్‌డి చేసిన మహిళలు ఉన్నారని వారిని గుర్తించి ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

**నేడు యుఎఇకి చంద్రబాబు : దుబారులో రోడ్‌షో**

రాష్ట్రానికి పెట్టుబడుల సమీకరణలో భాగంగా సిఎం చంద్రబాబు బుధవారం దుబారు వెళ్లనున్నా రు. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే పెట్టుబడుల సమ్మిట్లో పాల్గొనేందుకు వివిధ సంస్థల ప్రతినిధులను ఆహ్వానించేందుకు అక్కడ మూడు రోజులపాటు పర్యటించనున్నారు. వివిధ అంతర్జాతీ య సంస్థల యాజమాన్యం, ప్రతినిధులతో చర్చిస్తారు. బుధవారం ఉదయం హైదరాబాద్ నుండి బయలుదేరనున్న చంద్రబాబు దుబారు చేరుకుని అక్కడ సిఐఐ ఆధ్వర్యాన నిర్వహించే రోడ్‌షోలో పాల్గొంటారు. తొలిరోజు ఎపిఎన్‌ఆర్‌టి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారు. ఐదు కంపెనీలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులతో చర్చిస్తారు. శోభాగ్రూప్, షరాఫ్‌డిజి, ట్రాన్స్‌వరల్డ్ గ్రూప్, లూథా గ్రూప్, దుబారు ఫ్యూచర్ ఫౌండేషన్ సంస్థల ప్రతినిధులతో సిఎం సమావేశమవుతారు. ఇండస్ట్రియల్, ఐటి పార్కులు, లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ సదుపాయాలు, పోర్టులు, షిప్ మేనేజ్‌మెంట్ వంటి రంగాల్లో పెట్టుబడులపై ఆయా సంస్థల ప్రతినిధులతో చర్చిస్తారు. ఈ పర్యటనలో మంత్రులు టిజి భరత్, బిసి జనార్ధన్‌రెడ్డి, సిఎం సెక్రటరీ కార్తికేయమిశ్రా, ఇండ్రస్టీస్ సెక్రటరీ యువరాజ్, ఎపి ఇడిబి సిఇఒ సాయికాంత్ వర్మ, రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ సిఇఒ ధాత్రిరెడ్డి పాల్గొంటారు. విశాఖలో పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం ప్రధానిని ఆహ్వానించింది. సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ రోడ్‌షోలు కూడా నిర్వహించారు.

# 2027 ఫిబ్రవరి లోగా..

(మొదటిపేజీ తరువాయి)

2026 ఏప్రిల్‌లో బకాయిల్లో 10 శాతం మొత్తాన్ని, మిగిలిన 90 శాతం మొత్తాన్ని ఆగస్టు, నవంబరు, 2027 ఫిబ్రవరిలో 3 సమాన వాయిదాల్లో చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో వివరించారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో చెల్లించే 10 శాతం మొత్తాన్ని ఒపిఎస్, పిటిడి ఉద్యోగులకు, జిపిఎఫ్ ఖాతాకు జమ చేయనున్నట్లు, సిపిఎస్ ఉద్యోగులకు ప్రాన్ (పిఆర్‌ఎఎన్) ఖాతాలో చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. ఇపిఎఫ్ (95) ఉద్యోగులకు డిఎ బకాయిలను ఇపిఎస్-95 నియమాల ప్రకారం లెక్కించి తదనుగుణంగా చెల్లించనున్నట్లు వెల్లడించారు. పిటిడి ఉద్యోగులతో సహా సిపిఎస్ ఉద్యోగులకు ఆ మొత్తాన్ని నగదు రూపంలో చెల్లిస్తామని, ఇపిఎఫ్ 95 ఉద్యోగులకు డిఎ బకాయిలను ఇపిఎస్-95 నియమాల ప్రకారం చెల్లించనున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. అంతకుముందు బకాయిలను రిటైర్‌మెంట్‌తో ముడిపెడుతూ జారీ చేసిన 60,61 జిఓలపై ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కొన్ని ఉద్యోగ సంఘాలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్చలు జరిపిన అనంతరం ఈ జిఓలు జారీ అయిన విషయం తెలిసిందే. అయితే, చర్చల సందర్భంగా ప్రస్తావనకు రాని అంశాలను ఉత్తర్వుల్లో పేర్కొనడం పట్ల ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. 2024 జనవరి 1వ తేదీ నుంచి డిఎను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరు వరకూ 21 నెలల డిఎ బకాయిలను ఉద్యోగ విరమణ అనంతరం వారి ఖాతాలకు జమ చేయనున్నట్లు, మరణించిన ఉద్యోగుల విషయంలో వారసులకు అందించనున్నట్లు పేర్కొనడం కలకం రేపింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా డిఎ బకాయిలను ఉద్యోగ విరమణ అనంతరం జమ చేస్తామని పేర్కొన్నారంటూ ఆగ్రహం వ్యక్తమైంది. గత ఏడాదే ప్రకటించాల్సిన పిఆర్‌సి విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం, 16 నెలలుగా ఐఆర్ మంజూరుపైన నిర్ణయం ప్రకటించకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో డిఎ ప్రకటిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే సవరించాలని యూటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్‌లు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎస్సి, ఎస్టి ఉపాధ్యాయుల సంఘం, ఎపి ఎస్‌టిఎఫ్‌లు కూడా ఈ మేరకు డిమాండ్ చేశాయి.

# టారిఫ్‌లతో గ్లోబల్ కంపెనీలకు దెబ్బ

(మొదటిపేజీ తరువాయి)

రాయిటర్స్ విశ్లేషణ ప్రకారం.. 2025లో కంపెనీలు 21 బిలియన్ డాలర్ల నుంచి 22.9 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.2 లక్షల కోట్లు) నష్టాలను ఎదుర్కనే అవకాశాలున్నాయి. వచ్చే ఏడాది 2026లో 15 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.3 లక్షల కోట్లు) నష్టం ఉండొచ్చు. దిగ్గజ ఆటోమొబైల్ కంపెనీ టొయోటా 9.5 బిలియన్ల (రూ.83వేల కోట్లు) అంచనాతో అతిపెద్ద నష్టాన్ని ఎదుర్కోనుంది. యూరప్, జపాన్‌తో ట్రంప్ చివరగా కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల అనేక కంపెనీలు తమ మునుపటి అత్యధిక నష్ట అంచనాలను తగ్గించాయి. ఉదాహరణకు, స్టెల్లాంటిస్, పెర్నోడ్ రికార్డ్ వంటి కంపెనీలు యూరప్ ఒప్పందం తర్వాత తమ నష్ట అంచనాలను తగ్గించాయి.

**నష్టపోతున్న ప్రధాన రంగాలు**

అధిక టారిఫ్‌లతో వినియోగదారు ఉత్పత్తులు, తయారీ రంగాలు అత్యధికంగా నష్టపోతున్నాయి. వియత్నాం వంటి ఆసియా దేశాలపై ఆధారపడే కంపెనీలు ఎక్కువ నష్టాన్ని ఎదుర్కొంటున్నాయి. భారత్ లాంటి దేశాలు టెక్స్‌టైల్, ఫుట్‌వేర్, సముద్ర ఉత్పత్తులు, అభరణాల రంగాల కంపనీల ఆదాయాలు పడిపోతున్నాయి. చైనాపై కొత్త సుంకాల బెదిరింపు భవిష్యత్తులో అనిశ్చితిని మరింత పెంచొచ్చనే ఆందోళనలు నెలకొన్నాయి.

**చైనాపై టారిఫ్‌లతో కొత్త సవాళ్లు**

ట్రంప్ ఇటీవల చైనాపై అదనంగా 100 శాతం సుంకాలను విధించే ఆలోచనను ప్రతిపాదించారు. అయితే ఈ సుంకాలు స్థిరంగా ఉండవని ఆయన తర్వాత తెలిపారు. ఈ అనిశ్చితి కంపెనీలకు కొత్త సవాళ్లను తెచ్చిపెడు తోంది. మరోవైపు అమెరికాతో చైనా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోకపోతే 155 శాతం సుంకాలను విధిస్తామని ట్రంప్ తాజాగా హెచ్చరించడం గ్లోబల్ కంపెనీల గుండెల్లో రైళ్లను పరుగెత్తిస్తుంది. ట్రంప్ విధానాలు కంపెనీల ఆదాయాలను ఒత్తిడికి గురి చేస్తున్నా యని తీవ్ర ఆందోళనలో ఉన్న గ్లోబల్ కంపెనీలను తాజాగా అమెరికా, చైనా మధ్య నెలకొన్న టారిఫ్ ఉద్రిక్తతలు మరింత బెంబేలెత్తిస్తున్నాయి.

# గాజా ఒప్పందానికి ఇజ్రాయిల్ తూట్లు

(మొదటిపేజీ తరువాయి)

అంతకుముందు 24గంటల్లో 45మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. ఒప్పందం కుదిరినప్పటి నుండి ఇప్పటివరకు 165మంది పాలస్తీనా ఖైదీల మృతదేహాలను ఇజ్రాయిల్ అప్పగించింది. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో శాంతి వీచికలు వీస్తాయని ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అందుకు భిన్నంగా ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడుతుండటంతో కాల్పుల విరమణ ఒప్పందం సజావుగా అమలయ్యేలా చూసేందుకు ఉపాధ్యక్షుడు జెడి వాన్స్‌ను టెల్ అవీవ్ పంపారు. వాన్స్ వెంట మధ్య ప్రాచ్య వ్యవహారాలు చూసే దూత స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్నర్ కూడా వున్నారు. గాజాలో సుస్థిరంగా, దీర్ఘకాలం శాంతి నెలకొనాలంటే అనుసరించాల్సిన పంథాపై చర్చించేందుకు వారిక్కడకు వచ్చారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహూను విట్‌కాఫ్, కుష్నర్ సోమవారం కలవగా, అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, ఆయన సతీమణి ఉషా వాన్స్ మంగళవారం నెతన్యాహూతో భేటీ అయ్యారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని సజావుగా అమలయ్యేలా చూడాల్సిందిగా వాన్స్ నెతన్యాహూను కోరారు.

# జనజీవనస్రవంతిలో కలవండి

(మొదటిపేజీ తరువాయి)

రూ.2 కోట్లను నష్టపరిహారంగా ప్రభుత్వం చెల్లిస్తున్నదనీ, అలాగే వారి కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, 300 గజాల స్థలాన్ని కూడా ఇవ్వడం జరుగుతున్నదని వివరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల అదుపునకు కృషి చేస్తున్న పోలీసుల సంక్షేమం పట్ల ప్రభుత్వం అన్ని విధాలా చేయూత నిస్తుందన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, సైబర్ నేరాలు, డ్రగ్స్ మాఫియా మొదలుకొని మత కలహాలను అదుపు చేయడంలో పోలీసులు రేయింబవళ్లు కృషి చేస్తున్నారనీ, వారు అందిస్తున్న సేవలకు ప్రజలు కూడా తగిన గుర్తింపును ఇవ్వాలని కోరారు. 2009లో ఆంధ్రప్రదేశ్‌లోని బలిమెల రిజర్వా యర్‌లో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన 32 మంది పోలీసులకు కూడా తమ ప్రభుత్వం గాజులరామారంలో ఒక్కొక్కరికి 200 గజాల భూమిని కేటాయిస్తు తాజాగా నిర్ణయం తీసుకున్నదని తెలిపారు. వారికి నష్టపరిహారం చెల్లించడంలో గత ప్రభుత్వాలు తగిన నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. పెరిగిపో తున్న సైబర్ నేరాలను అరికట్టడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయని అన్నారు. డ్రగ్స్ మాఫియాను కట్టడి చేయడానికి ఈగల్ ఫోర్స్ సైతం చేస్తున్న కృషి కూడా ఫలిస్తున్నదని రేవంత్‌రెడ్డి మెచ్చుకున్నారు. చట్టాలను గౌరవించేవారి పట్ల ఫ్రెండ్లీగా, అతిక్రమించేవారి పట్ల కఠినంగా పోలీసులు వ్యవహరిస్తారనే సందేశాన్ని పోలీసులు సమాజంలోకి పంపిం చాలని ఆయన కోరారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెద్ద ఎత్తున రావడానికి శాంతి భద్రతలే ప్రధాన కారణమనీ, దాని పరిరక్ష ణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని సీఎం చెప్పారు. దేశంలోనే శాంతి భద్రతల పరిరక్ష ణలో రాష్ట్ర పోలీసులు మొదటి స్థానంలో ఉండటం గర్వకారణ మన్నారు. పోలీస్ శాఖలో మహిళలను ప్రోత్స హిస్తూ మహిళా ఐపీఎస్ అధికారులు పలువురికి కీలకమైన బాధ్యతలను అప్పగించడం జరిగిందనీ, మూడు ప్రధాన పోలీస్ కమిషనరేట్లలో ఏడుగురు మహిళా ఐపీఎస్ అధికారులు డీసీపీ బాధ్యతలను నిర్వహిస్తున్నారని సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పోలీస్ శాఖను మరింత పటిష్టం చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

**లొంగిపోవడమే మార్గం: డీజీపీ శివధర్‌రెడ్డి**

రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. వారి త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్ర పోలీస్ శాఖ మరింత స్ఫూర్తిదాయకంగా పని చేయాలని పిలుపునిచ్చారు. విధి నిర్వహణలో కత్తిపోట్లకు గురై మరణించిన కానిస్టేబుల్ ప్రమోద్ కుటుంబానికి అండగా నిలుస్తామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే ప్రఖ్యాతి గడించిన రాష్ట్ర పోలీస్ శాఖ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా మరింత ఇనుమడించిన శక్తితో పని చేస్తున్నదని ఆయన తెలిపారు. మావోయిస్టులకు రాష్ట్రంలో తమ కార్యాలాపాలను కొనసాగించే పరిస్థితులు లేవనీ, లొంగిపోవడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

**'పోలీస్ అమరులు వీరు' పుస్తకాన్ని ఆవిష్కరించిన సీఎం**

అనంతరం 'పోలీస్ అమరులు వీరు' అనే పుస్తకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. తర్వాత ఆ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాన్ని ఉంచి ముఖ్యమంత్రి శ్రద్ధాంజలి ఘటించారు. వీరితో పాటు ప్రిన్సిపల్ సెక్రెటరీ (హౌం) సి.వి ఆనంద్, డీజీపీ శివధర్‌రెడ్డి, పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మాజీ డీజీపీలు కూడా అమరవీరుల స్థూపం వద్ద పుష్ప గుచ్ఛాలుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అదే ప్రాంగణంలో ఈ ఏడాది విధి నిర్వహణలో మరణించిన రాష్ట్రానికి చెందిన ఆరుగురు పోలీసుల కుటుంబ సభ్యులను ఎస్ఐబీ డీజీ సుమతి ముఖ్యమంత్రికి పరిచయం చేయగా వారిని ఆయన పరామర్శించి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం

(మొదటిపేజీ తరువాయి)

జహంగీర్‌పురి, బురారి వంటి ప్రాంతాల్లో ఎక్యూఐ 480 దాటినట్లు వెల్లడైంది. ఇది దేశ సగటు కంటే దాదాపు 1.8 రెట్లు ఎక్కువ అని అధికారులు తెలిపారు. యునెస్కో రికార్డుల ప్రకారం%ొ% ఏకంగా 15 రెట్లు ఎక్కువని నిపుణులు పేర్కొన్నారు. ఇది చాలా ప్రమాదకరమని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిబిసిబి) పేర్కొంది. బుధవారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అందువల్ల అత్యవసర పరిస్థితుల్లోనే ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. కాలుష్యం పెరగడంలో కళ్లు, ముక్కు, గొంతులో మంట, దురద సమస్యలు తలెత్తుతాయని వైద్యులు తెలిపారు. అందువల్ల మాస్కులు ధరించాలని సూచిస్తున్నారు.

**గతేడాది కంటే పెరిగిన కాలుష్యం**

గత దీపావళితో పోల్చితే ఈసారి ఎయిర్ పొల్యూషన్ భారీగా నమోదైంది. గతేడాది దీపావళి మరుసటి రోజు ఉదయం ఎక్యూఐ 296 పాయింట్లుగా నమోదు కాగా.. ఈసారి పండగ సాయంత్రానికే ఎయిర్ క్వాలిటీ దారుణంగా పడిపోయింది. ఇందుకు బాణసంచా కాల్చడమే ప్రధాన కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎన్‌సిఆర్ పరిధిలో బాణసంచా కాల్చడంపై ఇటీవల సుప్రీంకోర్టు నిషేధం విధించింది. అయితే%ొ% కొత్తగా ఢిల్లీలో అధికారంలోకి వచ్చిన బిజెపి సర్కారు విజ్ఞప్తితో ఈసారి గ్రీన్ క్రాకర్స్ కాల్చుకునేందుకు ఈ నెల అక్టోబరు 15న సుప్రీంకోర్టు షరతులతో కూడిన అనుమతినిచ్చింది. అయితే%ొ% ఈ గ్రీన్ క్రాకర్స్ పేరుతో మార్కెట్లో గడువు ముగిసిన, నాణ్యత లేని బాణసంచా విచ్చలవిడిగా అమ్మకాలు జరిగాయి. ఫలితంగా బాణసంచా సౌండ్స్ కన్నా%ొ% పొల్యూషన్ భారీగా పెరిగింది. ఢిల్లీ వాసులు సైతం భారీగా బాణసంచాను కొలుగోలు చేశారు. రాత్రి 8 గంటల నుంచి 10 గంటల వరకే టపాసులు కాల్చుకునేందుకు కోర్టు అనుమతినివ్వగా%ొ% అర్ధరాత్రి వరకు బాణసంచా కాల్చారు. దీనికి వాతావరణ మార్పులు తోడవడంతో కాలుష్య కారకాలు అలాగే అంటిపెట్టుకొని గాలి తేమతో కలిసిపోయాయి.

**ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్**

ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్ కాస్టింగ్ అండ్ రీసెర్చ్ ప్రకారం%ొ% ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ)లో స్థానిక ప్రాంతంలోని గాలి నాణ్యతలను తెలుసుకోవచ్చు. ఎక్యూఐ 0-100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉండి కాలుష్యం లేదని అర్థం. అదే 100-200 ఉంటే గాలి నాణ్యత మధ్యస్థంగా ఉందని, ఇక 200-300 మధ్య ఉంటే అధ్వానంగా ఉందని, 300-400 ఉంటే గాలి నాణ్యత మరింత అధ్వానంగా ఉన్నట్లు. ఇక 400-500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉన్నట్లు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పెరిగిన కాలుష్యంతో సర్కారు దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గ్రేడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి) రెండో దశను అమల్లోకి తెచ్చింది. దీని ప్రకారం%ొ% నిర్మాణ పనులపై పరిమితులు విధించింది. తద్వారా నిర్మాణ సైట్స్ నుంచి వచ్చే దుమ్మూ, దూళిని కంట్రోల్ చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. డీజిల్ జనరేటర్ల వినియోగంపై నిషేధం పెట్టింది. ప్రైవేట్ వాహనాలను కంట్రోల్ చేసేలా%ొ% ఎలక్ట్రిక్ బస్సులు, మెట్రో రైళ్ల సేవలు పెంచింది. స్టూడెంట్స్, ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే పిల్లల కోసం ఆన్‌లైన్ క్లాసులు పెట్టే పరిశీలన చేస్తోంది. వీటితోపాటు రోడ్లపై నీటి స్ప్రేలు, యాంటీ-స్మాగ్ గన్స్ వినియోగం పెంచాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

# విశాఖ ఉక్కులో మరో 500 మందిపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

ప్రైవేటీకరణ నిర్ణయం నేపథ్యంలో మెడమీద కత్తి వేలాడుతున్న విషయం తెలిసినప్పటికీ, పండుగ ముందు రోజు ఇంత నిర్ధాక్షణ్యంగా వ్యవహరించడం చర్చనీయాంశంగా మారిం ది. ఉక్కు నగరంలో ఈ విషయం కలకలం రేపింది. యాజమాన్యపు ఈ తీరు పట్ల తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ కోసం కేంద్ర ప్రభుత్వం 11.440 కోట్ల రూపాయల ప్యాకేజిని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ ప్యాకేజి నిధుల కోసం కేంద్రం పెట్టిన షరతుల్లో భాగంగానే కాంట్రాక్టు కార్మికుల పొట్టగొడుతున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కేంద్రం విడతల వారీగా నిధు లు విదిలిస్తుండగా దానికి తగ్గట్టుగానే కాం ట్రాక్టు కార్మికులను ఉక్కు యాజమాన్యం వి ధుల నుండి తొలగిస్తోంది. తమ కృషి వల్లే వి శాఖ ఉక్కుకు ప్యాకేజి వచ్చిందని రాష్ట్ర ము ఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్‌లు పదే పదే చెబుతున్న విషయం తెలిసిందే. అదే సమయంలో కార్మికుల తొలగింపు గురించి మాత్రం ఆ కూటమి పార్టీల నేతలు పెదవి వి ప్పడం లేదు. తాజాగా 500 మంది తొలగిం పుతో ఇంకా ఇవ్వాల్సిన రూ.1,400 కోట్ల పైచిలుకు ప్యాకేజీలో కొంత ఉక్కు యాజమా న్యానికి దక్కే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

**స్థానికేతరులకు అవకాశం?**

తొలగించిన కాంట్రాక్టు కార్మికుల స్థానంలో తాత్కాలిక పాస్‌లతో కొత్తవారిని చేర్చుకోవాలని కేంద్ర ప్రభుత్వం నుండి సూచనలు వచ్చినట్లు చెబుతు న్నారు. దీంతో ఇప్పటికే తొల గించిన వేలాదిమంది స్థానంలో కొత్త వారిని తీసుకోవడానికి ప్రయత్నాలు ప్రారంభమైనా యి. అయితే, స్థానికులకు కాకుండా ఇతర రాష్ట్రాల్లో తక్కువ కూలికి పనిచేయడానికి ముందుకు వచ్చేవారిని పిలిపిస్తున్నట్లు సమాచారం. మరోవైపు కార్మికుల కొరతతో రా మెటీరియల్ హేండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌ఎంహెచ్‌పి) నాలుగు నెలలుగా నడవలేని పరిస్థితికి వచ్చింది.

# కాలిన.. కాలుష్యం!

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కసారిగా పేలిన టపాసులతో గాల్లో కాలుష్యం తీవ్రత పెరి గింది. పొగ నిండిపోయి గాలి నాణ్యత దెబ్బతింది. ముఖ్యంగా సోమవా రం రాత్రి 7 గం టల నుంచి అర్ధరాత్రి 12 గం టల వరకు గాలి నాణ్యతను సూచించే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా రెడ్‌సిగ్నల్‌లోకి చేరింది. బాణ సంచావల్ల అత్యధిక కాలుష్యం అమలా పురంలో నమో దైంది.

**అమలాపురాన హై...**

ఉమ్మడి జిల్లా మొత్తం మీద అమలాపురం పట్టణంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. వాయుకాలుష్యం అత్యధికంగా ఇక్కడే నమోదైంది. పండగరోజు సోమవారం సాయం త్రం ఆరు గంటలకు ఏక్యూఐ 65 నుంచి ఏకంగా 138కి చేరింది. రాత్రి 7 గంటలకు 229, 8 గంటలకు 243, 9 గంటలకు 222, 10 గంటలకు212, 11గంటలకు 198, అర్ధరాత్రి 12గంటలకు 164 నమోదైంది. తిరిగి మంగళ వారం 11గంటల తర్వాత వాయు కాలుష్య తీవ్రత తగ్గిపోయి తిరిగి 56కి చేరింది.

**రాజమండ్రిలో ఇలా..**

రాజమహేంద్రవరంలోను వాయు కాలుష్యం భారీగా వెదజల్లింది. సోమవారం సాయం త్రం 5 గంటలకు ఏక్యూఐ 82గా నమోదైంది. 6 గంటలకు 121, 7గంటలకు 196, 8 గంటలకు 212, 9గంటలకు 199, 10 గం టలకు 197, 11గంటలకు 198, 12గంటలకు 164 చొప్పున నమోదైంది.మంగళవారం ఉదయం 10గంటల తర్వాత 62కి చేరింది.

**కాకినాడలో కాస్త బెటర్**

కాకినాడ నగరంలో సోమవారం సాయం త్రం 6 గంటలకు ఏక్యూఐ 156 ఉండగా, 7గంటలకు 174, 8గంటలకు 173, 9 గం టలకు 164, 10 గంటలకు167, 11 గం టలకు 166, 12గంట లకు 151 నమోదైంది. అర్ధరాత్రి ఒంటిగంటకు 138, 2గంటలకు 103 నమోదవగా ఉదయం 8 గంటలకు తిరిగి 66కి చేరి గాలి నాణ్యత మెరుగైంది.

**స్వచ్ఛమైన గాలి లేదు!**

గాలిలో నాణ్యత సూచిక (ఏక్యూఐ) ఆధా రంగా కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలు రూ పొందించింది. ఏక్యూఐ సంఖ్య 50 పాయింట్లలోపు ఉంటే అక్కడ గాలి నాణ్యత బాగుం దని అర్థం. 50 నుంచి 100 వరకు ఉంటే మోడరేట్, 100 నుంచి 150 వరకు ఉంటే పూర్, 150 నుంచి 200మధ్య ఉంటే అన్‌హెల్తీ వాతా వరణం కింద భావించాలి. పండగ రోజు రాత్రి కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలో వాయుకాలుష్య తీవ్రత పెరిగిపోయింది. ఏక్యూఐ 100 దాటితే ఆస్తమా, కిడ్నీ, గుండె జబ్బులతో బాధపడుతున్న వారు శ్వాస తీసు కోవడం ఇబ్బందిగా మారుతుంది. ఏక్యూఐ 200 దాటితే శ్వాస సమస్యలు ఎదుర్కొంటారు.ఎందుకంటే మందుగుండు పేలుడుతో వెదజల్లే వాయు కాలుష్యంలో కార్బన్ డయాక్సైడ్, నైట్రోజెన్ డయా క్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ మోతాదు అధికం. దీనివల్ల శ్వాస సమస్యలు వస్తాయి.దీపావళి రోజు రాత్రి ఏకంగా అమలాపురం, రాజ మహేంద్రవరంలో ఏక్యూఐ 200 పాయింట్లు దాటేసింది.

## చందనబ్రదర్స్, సీఎంఆర్ అధినేత మృతి తీరనిలోటు

- మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** గోరంట్ల చౌడేశ్వరి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న చౌడేశ్వరి దేవస్తానం ఆవరణలో దేవాంగ దానకుల రత్న దేవాంగ చందన మోహన్ రావు మృతి చెందగా దేవాంగ కులస్తులు,నేత కార్మికులు,యజమానులు,ఘన నివాళులు అర్పించారు, ఈ విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి హిందూపురం మాజీ పార్లమెంటు సభ్యులు నిమ్మల కిష్టప్ప నివాళులు అర్పించారు. అలాగే ప్రముఖ వ్యాపార వేత్త, సృష్టిలో ప్రధమ వస్త్ర సూత్రధారి దేవలమహర్షి వంశంలో దేవాంగ కుటుంబంలో జన్మించినటువంటి, లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు,కల్పించినటువంటి దేవాంగ ముద్దుబిడ్డ చందన బ్రదర్స్ అధినేత చందనమోహన్ రావు మృతి చెందడం బాధాకరమన్నారు. 1976లో చందనబ్రదర్స్, సి ఎంఆర్ అనే సంస్థను స్థాపించి ప్రముఖ వస్త్ర వ్యాపారాన్ని దూర దృష్టితో, తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ సంస్థగా నెలకొల్పి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చందనబ్రదర్స్ అనే బ్రాండ్ కనబడుతుందన్నారు, ఈరోజుకు కూడా, అంతటిముందు ఆలోచనతో చందన బ్రదర్స్ అనే సంస్థను స్థాపించి ఎన్నో దేవస్థానాలు, విద్యా ఆలయాలు నిర్మించి ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు చేసి, ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలు గడించి నటువంటి చందనబ్రదర్స్ వ్యవస్థాపకులు చందనమోహన్‌రావు మృతి యావత్ చేనేత సమాజిక వర్గానికి తీరని లోటని అన్నారు,మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్, మాజీ ఎంపీపి నిమ్మల విద్య ధరణి,రామాంజనేయులు,వార్డు సభ్యులు లక్ష్మి నాగరాజు,వెంకట చలం, కర్ణ, తదితరులుపాల్గొని,ఆయనచిత్రపటానికి పూలమాలలువేసిఘన నివాళులర్పించారు.

## బాలుడికి రూ.లక్ష ఆర్థిక సాయం



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న 12 ఏళ్ల బాలుడికి గోరంట్లకు చెందిన శ్రీమతి వెంకట లక్ష్మమ్మ నూకల ఈశ్వరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆపన్న హస్తంగా రూ.లక్ష చెక్కును బాలుడి తల్లిదండ్రులకు అందజేశారు, ఈ సందర్భంగా గోరంట్ల పట్టణంలోని వాసవి మహల్ నందు మంగళవారం వెంకట లక్ష్మమ్మ నూకలఈశ్వరయ్య గుప్తా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కమిటీ సభ్యులు(కుటుంబ సభ్యులు) బలరాం గుప్తా బ్రమరాంబ, హరి బాబు గుప్తా ,విజయలక్ష్మి, గౌరీ శంకర్, వరలక్ష్మి, కుమార్తె, అల్లుడు శ్రీకాంత్ ,రోహిణి లు కలసి క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న అనంతపురం కు చెందిన కిరణ్ కుమార్, కృష్ణకుమారి దంపతుల కుమారుడు చిన్ని కృష్ణ ఉదయ్ పవన్ కుమార్ బెంగళూరు శంకర్ క్యాన్సర్ ఆసుపత్రి లో చికిత్సల కోసం లక్ష రూపాయల చెక్కును అందజేశారు, ఈ సందర్భంగా ఆర్థిక సహాయం అందించాలని ట్రస్ట్ నిర్వాహకులకు కోరగా వెంటనే బలరాం గుప్తా వారి కుటుంబ సభ్యులను చర్చించి అందజేశారు,ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు ఫణి రాజు, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి నంద గోపాల్, సంఘం నాయకులు తిరుపాల్, హరీష్, ఫణి కుమార్, సుకుమార్ గుప్తా, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మురళీ నాయక్‌కు నివాళి అర్పించిన పోలీసులు

- కల్లితండాలో అమరవీరుల దినోత్సవ వేడుకలు



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు అమరవీరుల దినోత్సవ వేడుకల సందర్భంగా గోరంట్ల మండలం లోని కల్లితండా గ్రామం లోని వీర జవాన్ మురళీ నాయక్ ఘాట్ వద్ద సీఐ బోయ శేఖర్, ఎస్ఐలు రామచంద్ర, ఉమాదేవి మరియు పోలీస్ సిబ్బందితో కలిసి ఘన నివాళులు అర్పించారు, అలాగే పోలీస్ అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకున్నారు,అలాగే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్ మురళీనాయక్ స్మృతిని గౌరవించి, ఆయన వీరత్వం మరియు సేవకు గుర్తుగా ఆయన సమాధి వద్ద పుష్పాంజలులు అర్పించి మా గాఢమైన గౌరవ వందనం చేశారు, అనంతరం ఆయన ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను కలసి మనస్పూర్తిగా సానుభూతి వ్యక్తం చేసి, వారికి ధైర్యం చెప్పాము. దేశం ఎప్పటికీ ఆయన పరమ త్యాగాన్ని స్మరించుకుంటుందని వారికి హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



# పోలీసు అమరవీరుల త్యాగాలను గుర్తుంచుకోవాలి

### రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి

### శాంతి భద్రతల పరిరక్షణలో అమరులైన పోలీసులందరికీ జోహార్లు : జిల్లా ఎస్పీ ధీరజ్







**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రజలందరూ గుర్తుంచుకోవాలని రాష్ట్ర రవాణా యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళ వారం ఉదయం జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో మంత్రివర్యులు సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అమరులైన పోలీసు వీరులకు మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఎస్పీ ధీరజ్ జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఘనంగా నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని, 1959 అక్టోబర్ 21 న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సీఆర్పీయఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలు అర్పించారని, వారి ధైర్యాన్ని మరియు త్యాగాన్ని స్మరించుకోవడానికి, మరియు యూనిఫామ్ ధరించి, దేశానికి సేవ చేస్తున్న వారి సేవలను గుర్తించుకోవడానికి అక్టోబర్ 21 న పోలీసు సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. భారతదేశానికి చైనా, పాకిస్తాన్ తదితర దేశాలతో గల సరిహద్దులలో ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని, ఆ సరిహద్దులలో... పర్వతశ్రేణులు, మంచు కొండలు వంటి క్లిష్ట పరిస్థితులు ఉంటాయని, అయినప్పటికీ మన జవానులు దేశ రక్షణలో నిరంతరం మునిగి ఉంటారన్నారు. రాష్ట్రంలోని పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో, చట్టాలను పరిరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని, శాంతిభద్రతల పరిరక్షణలో మాత్రమే కాకుండా రాత్రిపూట పెట్రోలింగ్, ట్రాఫిక్ ను నియంత్రించడం, మెడికల్ ఎమర్జెన్సీలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలలో ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారలన్దిస్తామని తెలిపారు. వారి త్యాగాలను మరచి పోకూడదని, వారి అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేసారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగనిరతికి ప్రతి సంవత్సరము అక్టోబరు 21వ తేదీన పోలీసు అమరవీరుల దినముగా పరిగణిస్తున్నామన్నారు. దేశభద్రత కోసం పగలనక, రేయనక, విధినిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్ళు, అధికారులు విధులను విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా వారు తమ ప్రాణ త్యాగాలను, సేవలను సింహావలోకనం చేసుకుంటూ సేవల అర్ధాన్ని పరమార్ధాన్ని గుర్తిస్తూ కొనియాడుట మనందరి కర్తవ్యము అన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, కరుడుగట్టిన మతోన్మాదం మితిమీరిపోతున్న ప్రస్తుత తరుణంలో పోలీసు వృత్తి ప్రాణాలతో చెలగాటం అని తెలిసి కూడా వాటిని లెక్కచేయక ప్రజాసేవలో నిమగ్నం అవుతున్నామన్నారు. అగ్నిప్రమాదాలు, తుఫాన్ (సైక్లోన్)లు సంభవించు సందర్భాలలో పోలీసుల పాత్ర చాలా ఉందని, ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడే క్రమంలో పోలీసులు ఫ్రంట్ లైన్ వారియర్స్ ఉన్నారన్నారు. ఈ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న పోలీసులను కోరేది ఏమంటే మనమందరం కష్టపడి ప్రజా రక్షణలో నిమగ్నమై ప్రజల యొక్క ఆస్తులను, వారి ప్రాణాలను కాపాడుతూ... వారికి అవసరమైనప్పుడు మనము ఉన్నాము అని వారికి భరోసా ఇచ్చినప్పుడే, అమరులైన పోలీసులకు నివాళి అర్పించినట్లు అవుతుందన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన పోలీసులు అందరికీ జోహార్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌లు చోరీ చేసే అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్

### రూ.8,70,000 విలువచేసే 18 వాహనాల స్వాధీనం - వివరాలు వెల్లడించిన డీఎస్పీ నరసింగప్ప



**పెనుకొండ, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** నిలిపి ఉన్న ద్విచక్ర వాహనాలను అపహరిస్తున్న ఆరుగురు దొంగల ముఠాను అరెస్టు చేయడంతో పాటు వారి నుండి రూ,8,70,000 విలువచేసే 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పెనుగొండ డిఎస్పి నర్సింగప్ప తెలిపారు, మంగళ వారం మడకశిర అప్గ్రేడ్ సర్కిల్ పోలీస్ స్టేషన్లో సీఐ సుబ్రమణ్యం తో కలిసి డీఎస్పీ నర్సింగప్ప మీడి యాకు కేసు వివరాలను వెల్లడించారు. ముద్దాయిలు... ఏ.సురేష్,( 29) తండ్రి ఏ . నరసింహులు, రొద్దకంపల్లి గ్రామము, రొద్దం మండలం, ప్రస్తుత నివాసం,పి. నరసాపురంగ్రామము, పరిగి మండలం, బి.నరేష్,(27) సంవత్సరాలు తండ్రి మద్దిలేటప్ప, రొద్దకంపల్లి గ్రామము, రొద్దం మండలం. ప్రస్తుత నివాసం నల్లూరు గ్రామము, రొద్దం మండలం. ఏ.సంజయ్ కుమార్,( 26) తండ్రి అంజినప్ప, ఆమిదాలగొంది గ్రామం, మడకశిర మండలం, మల్లేశ్(27) తండ్రి నరసింహప్ప, ఆమిదాలగొంది గ్రామం, మడకశిర మండలం, ఎం.అనిల్,( 31),తండ్రి రాజప్ప, డి.అచ్చంపల్లి గ్రామం, మడకశిర మండలం. వడ్డే కుమార్,( 29)తండ్రి నాగప్ప, ఈ .అచ్చంపల్లి గ్రామం, మడకశిర మండలం. 1వ, 2వ ముద్దాయిలను 21.10.2025 న మడకశిర మండలం, కల్లుమర్రి క్రాస్ వద్ద అరెస్టు చేశారు. మిగిలిన వారిని 21.10.2025న మడకశిర మండలం, ఆమిదాల గొంది గ్రామంలోని ముద్దాయి సంజయ్ కుమార్ పొలం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. రొద్దం మం డలం, రొప్పాల గ్రామానికి చెందిన సోమశేఖర్ తండ్రి క్రిష్ణప్ప అను అతడు తేదీ 16.12.2024న జిల్లేడుగుంట జాతరకు వచ్చి, తన యొక్క సీబీ షైన్ మోటార్ సైకిల్ ఏ పి 02-సీసీ-5022 ను అదే విధంగా అతనితో పాటు వచ్చిన అతని స్నేహితుడు ముద్దరంగయ్య అను అతను సీబీ షైన్ మోటార్ సైకిల్ ఏ పి 39-ఏబి-5842ను జిల్లేడుగుంట గ్రామ సమీపంలో ఉండు ఒక మల్బరీ షెడ్ వద్ద పార్క్ చేసి ఉండగా, ఎవరో గుర్తుతెలియని దొంగలు రెండు మోటార్ సైకిళ్ళను దొంగిలించుకుని పోయినారన్నారు, అతని ఫిర్యాదు మేరకు మడకశిర పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినారు. అదే విధంగా యాడికి మండలం, లక్షుంపల్లి గ్రామానికి చెందిన ముచ్చాల రాజేష్ రెడ్డి తండ్రి లేట్ ముచ్చాల రాజారెడ్డి అను అతను దాదాపు15రోజులక్రితం అనగా 07.10.2025 న ఉదయం సుమారు 11.00 గంటల సమయంలో అనంతపురం నుండి తన వ్యక్తిగత పనుల నిమిత్తం తన యొక్క హొండా యాక్టివా 5జీ ఏ పి 02-సీడీ-6374 అను స్కూటి నందు మడకశిర టౌన్‌కు వచ్చినాడన్నారు. టిఫిన్ చేయడానికి అని మడకశిర టౌన్ లోని వాల్మీకి సర్కిల్ వద్ద తన యొక్క స్కూటిని నిలబెట్టి, ప్రక్కనే ఉన్న పద్మశ్రీ హొటల్ లోకి వెళ్ళి టిఫిన్ తిని తిరిగి వాల్మీకి సర్కిల్ వద్దకు వచ్చి చూడగా, అక్కడ తాను నిలబెట్టిన స్కూటి కనబడలేదన్నారు. అంతట అతను చుట్టుప్రక్కల వెతకగా ఎక్కడా స్కూటి కనబడక పోవడంతో అప్పటి నుండి తన స్కూటీ కోసం వెతుకుతూ ఉండి, ఎక్కడా దొరకనందున ఈ దినమ అనగా 21.10.2025 న మడకశిర పోలీస్ స్టేషన్ కు వచ్చి జరిగిన విషయంపై ఫిర్యాదు చేయగా, అతని ఫిర్యాదు మేరకు మడకశిర పోలీస్ స్టేషన్ లో ఇన్స్పెక్టర్ ఆర్ జి సుబ్రమణ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా మడకశిర అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం తన సిబ్బందిని రెండు టీములుగా విభజించి, సదరు మోటార్ సైకిళ్ళ దొంగల కోసం వెతుకుతుండగా, ఈ దినం మోటార్ సైకిళ్ళ దొంగల గురించి ఇన్స్పెక్టర్ కి రాబడిన సమాచారమును జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్, ఐపీఎస్ కి తెలిపి, వారి ఆదేశాల మేరకు, డి ఎస్ పి యూ.నరసింగప్ప, పెనుకొండ వారి పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం , వారి సిబ్బందితో కలిసి కేసుకు సంబంధించి సురేష్ నరేష్ అను ముద్దాయిలను 21.10.2025 న ఉదయం 11.00 గంటలకు మడకశిర మండలం, కల్లుమర్రి క్రాస్ వద్ద అరెస్ట్ చేసి, వారు తాము దొంగతనం చేసిన రెండు మోటార్ సైకిళ్ళను అమ్మడానికి తీసుకుని వస్తుండగా, వారి వద్ద నుండి 2 మోటార్ సైకిళ్ళను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. సురేష్, నరేష్ అను ముద్దాయిలు గతంలో మధుగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనం చేయగా, వారిపై మధుగిరి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయ్యి, ఇంతకు మునుపే మధుగిరి పోలీస్ వారు వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినారు. అదే విధంగా తనకు రాబడిన సమాచారం మేరకు ఇన్స్పెక్టర్ సుబ్రమణ్యం వారి సిబ్బందితో కలిసి కేసుకు సంబంధించి, మడకశిర మండలం, ఆమిదాలగొంది గ్రామం వద్ద సంజయ్ కుమార్ అను అతని పొలం వద్ద పై తెలిపిన సంజయ్, కుమార్, మల్లేశ్,.అనిల్, వడ్డే కుమార్ అను నలుగురు ముద్దాయిలను అరెస్ట్ చేసి, ఆ తర్వాత అమ్మాలనే ఉద్దేశ్యంతో సదరు సంజయ్ కుమార్ అను అతని పొలంలో దాచిపెట్టిన 16 స్కూటీలను వారి వద్ద నుండి స్వాధీనం చేసుకున్నారు. సదరు 16 స్కూటీలలో 15 స్కూటీలను కర్ణాటక రాష్ట్రం, బెంగళూరు సిటీలోని కోరమంగళ నుండి తీసుకుని వచ్చినారన్నారు. రికవరీ చేసిన మొత్తం 18 మోటార్ సైకిళ్ళ విలువ సుమారు 8,70,000/- రూపాయలు ఉండును. పోలీసు విచార ణలో భాగంగా సదరు ముద్దాయిలు చెప్పిన మేరకు వారు అందరూ వివిధ గ్యాంగులుగా ఏర్పడి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో వివిధ ప్రాంతాలలో రద్దీగా ఉండే ప్రాంతాలలో నిలబెట్టిన మోటార్ సైకిళ్ళు, స్కూటీలను గుర్తించి, వాటిని ఎవరికీ అనుమానం రాకుండా వైర్లను అడ్జెస్ట్ చేసి, స్టార్ట్ చేసి అక్కడినుండి దొంగతనంగా తీసుకుని వెళ్ళిపోయేవారు. "ప్రజలు తమ మోటార్ సైకిళ్ళను జాగ్రతగా పెట్టుకోవాలి. రాత్రి పూట ఆరుబయట పార్కింగ్ చేయకుండా, సురక్షితంగా ఉండడం కోసం మీ యొక్క ఇంటి కాంపౌండ్ లలో పార్క్ చేసుకోవాలి. మోటార్ సైకిళ్ళకు వీల్ లాక్ చేసుకోవాలన్నారు. వీలైతే మోటార్ సైకిళ్ళకు జీపీఎస్ ట్రాకర్ లను అమర్చుకుంటే మోటార్ సైకిళ్ళు ఒకవేళ దొంగతనం అయినా వాటిని సులభంగా కనుగొనవచ్చన్నారు ,అదే విధంగా ఎవరైనా అనుమానిత వ్యక్తులు మీ ప్రాంతాలలో, గ్రామాలలో కనిపిస్తే వారి సమాచారాన్ని తక్షణమే పోలీసు వారికి అందించవలెను" అని ఈ సంధర్భంగా డి ఎస్ పి నరసింహప్ప, పెనుకొండ వారు సూచించారు. పై రెండు కేసులలో ముద్దాయిలను పట్టుకుని, వారి వద్ద నుండి మొత్తం 18 మోటార్ సైకిళ్ళను రికవరీ చేసిన విషయంలో %ాణూా%, పెనుకొండ వారు మడకశిర పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్. సుబ్రమణ్యం ని, హెడ్ కానిస్టేబుల్ రామిరెడ్డి ని, కానిస్టేబుళ్లు నాగేంద్ర, అన్వేష్ మరియు ఇతర సిబ్బందిని అభినందించారు.

Truth of News
సూర్య వాస్తవం
RNI NO : APTEL/25/A0239
http://www.suryavastavam.in



## పోలీసు అమరవీరుల సంస్మరణ దినం




**పత్తికొండ టౌన్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు పత్తికొండలోని పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. పత్తికొండ డి.ఎస్.పి వెంకటరామయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఐ జయన్న తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్యసేవపై చేతులెత్తేసిన డబుల్ ఇంజన్ సర్కార్

- డీసీసీ మాజీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ డిమాండ్



**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ప్రజాసేవలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉచిత ఎన్టీఆర్ వైద్య సేవ విషయంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసిందని మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నెల ముందు ఓపి సేవలు ఎత్తేసిందని,11 రోజుల క్రితం ఇన్ పేషెంట్ సేవలు నిలిపివేసిందని. ఇప్పుడు అత్యవసర సేవలు కూడా నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రనని చెప్పారు. నిరుపేద ప్రజలు లక్షలకు లక్షలు కార్పొరేట్ ఆసుపత్రుల బిల్లులు చెల్లించలేక, వైద్యం చేయించుకోవడం లేదు. దీనివలన వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతుందని, మరి కొందరైతే ప్రాణాల మీద ఆశతో లక్షలకు లక్షలు అప్పులు చేసివైద్యంచేయించు కుంటున్నారని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఎంతో విజినరీ కలిగిన చంద్రబాబు నాయుడు ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పా ల్సిన అవసరం ఎంతైనా ఉందని, వైద్య సేవలు అందక ప్రాణాలు పోతే కూటమి ప్రభుత్వమే బాధ్యత వహిం చాల్సి ఉంటుందని నజీర్ రహమద్ అన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాట మాడకుండా వెంటనే ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్య శ్రీ నిపునరు ద్ధరించి, కొనసాగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఈ సందర్భంగా నజీర్ అహ్మద్ కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## జ్వరంతో మహిళ మృతి



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** జ్వరం బారిన పడిన ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని కమ్మవీధి కి చెందిన శ్రీనివాసులు భార్య ఉమాదేవి (54) గత మూడు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించిన నయం కాలేదు. దీంతో మంగళవారం స్థానిక జిల్లస ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

## కారు, బస్సు ఢీ

- నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు గాయాలు




**మదనపల్లె, , సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** కారు, ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. ఎస్ఐ కథనం మేరకు.. గాలివీడు మండలం, ప్యారంపల్లికి చెందిన జగదీష్ (30), సాయి చరణ్(26), గాలివీడుకు చెందిన పుల్లారెడ్డి, స్రవంతి లు బెంగుళూరు లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు గా పనిచేస్తున్నారు. దీపావళి పండుగకు స్వగ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో గడిపారు. తిరిగి విధులకు వెళ్లేందుకు గాలివీడు నుంచి వేకువజామునే కారులో బెంగుళూరు కు బయలు దేరారు. మార్గ మధ్యంలోని పెద్దమండ్యం మండలం, కలిచర్ల వద్ద ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ఎదు రెదురుగా కారు, బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు సాఫ్ట్‌వేర్ లు కారులో ఇరుక్కుపోయారు. బస్సులో మదనపల్లి నుండి లక్కిరెడ్డిపల్లికి విధులకు వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ఉండడంతో ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి స్థానికుల సాయంతో గడ్డపారలు ఉపయోగించి కారులోని బాధితులను బయటకు లాగి 108లో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డ బాధితులకు జిల్లా ఆస్పత్రిలో మెరుగైన చికిత్సలు అందించారు. గాయపడిన పుల్లారెడ్డి, జగదీశ్, స్రవంతి, సాయి చరణ్ ల పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు తిరుపతికి రిఫర్ చేశారు. పెద్దమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

**అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోసి, జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**ప్రజలకు సేవ చేయడంలో పోలీసు, రెవెన్యూశాఖలు కీలకం: జిల్లా కలెక్టర్ ఆనంద్**

**జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినం**





**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** సమాజ భద్రత, రక్షణల కోసం అసువులు బాసిన పోలీసు అమర వీరుల ఆశయాలను స్ఫూర్తిగా చేసుకుని విధుల్లో పునరం కితం అవుదామని అనంతపురం రేంజ్ డి.ఐ.జి డాక్టర్ షిమోసి జిల్లా ఎస్పీ పి.జగదీష్ పిలుపునిచ్చారు. మంగళ వారం నాడు జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సాయుధ బలగాల నుండీ డి.ఐ.జి, కలెక్టర్ , ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించి అనంతరం ప్రసంగించారు. అనంతరం అనంతపురం రేంజ్ డి.ఐ.జి డాక్టర్ షిమోసి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఎన్నో సేవలు అందిస్తూ ప్రాణ త్యాగాలు చేసిన పోలీసు అమర వీరులను స్మరిం చుకుంటూ పోలీసు అమరవీరుల దినం జరుపుకుంటు న్నాము. దేశ అంతర్గత భద్రతలో పోలీసులు పాత్ర కీలకమై నది. బాధ్యతాయుతమైనది. శాంతి భద్రతల పరిరక్షణ, సమాజ ప్రశాంతత కోసం 24/7 శ్రమిస్తున్నారు. న్యాయ శాఖ, ఇతర ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పోలీసులు పని చేస్తున్నారు. నేరాల నియంత్రణ, ముద్దాయిలకు శిక్షలు పడేలా కృషిచేస్తున్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన కుటుంబాలకు కారుణ్య నియమాకాలు అందజేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీల కృషి అభినందనీయం...ప్రజలకు, సమాజా నికి సేవ చేయడానికి యూనిఫాం సర్వీస్ ఎంతగానో ఉపయోగపడుతోంది. కానిస్టేబుల్ నుండీ ఐ.పి.ఎస్ అధికారుల వరకు ఉద్యోగంలో చేరే ముందు అందరూ ఒకే తరహా ప్రతిజ్ఞ చేస్తారు. ఆ ప్రతిజ్ఞ సారాంశానికి అనుగు ణంగా విధుల్లో నిరంతరం ప్రజలు, సమాజం కోస పని చేద్దామని డి.ఐ.జి గారు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ.. 1959 సంవత్సరం అక్టోబర్ నెల 21 వ తేదీన లడక్ ప్రాంతంలో మన దేశ మిలటరీ బలగాలకు చైనా దళాలకు భీకర యుద్ధం జరిగింది. ఆ సందర్భంగా మన వీర జవానులు 10మంది మరణించారు. అప్పటి నుండి అమరులైన వారి జ్ఞాపకార్థం పోలీసు అమరవీరుల వారోత్సవాలు మరియు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోన్న విషయం మీకు వివరించడం నా బాధ్యతగా భావి స్తున్నాను. జిల్లాలో కూడా పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నాము. ఈ వారోత్సవాలను ఈ ఏడాది అక్టోబర్ 21 ప్రారంభించి అక్టోబర్ 31 వరకు జరుపుకుంటాము. భావిభావి భారత పౌరులైన విద్యార్థినీ విద్యార్థులకు, ప్రజలకు పోలీసు విధుల పట్ల అవగాహన కల్పించడం, విధి నిర్వహణలో పోలీసు వినియోగించే ఆయుధాలు, ఇతర సామగ్రి గురించి వారికి వివరించి ఆసక్తి పెంపొందిపచేస్తున్నాం. పోలీసు నిబద్ధత, కార్యధీక్షత పట్ల చైతన్యం చేస్తున్నాం. పోలీసు అమరవీరుల స్ఫూర్తితో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమాన్ని సమీక్షించి వారి శ్రేయస్సు గురించి కృషి చేస్తున్నాము. ఈ వారోత్సవాలలో భాగంగా...ఎన్నో ప్రజా సేవా కార్యక్రమా లను జిల్లా అంతటా చేపట్టడం జరుగుతుంది. మన ప్రజా స్వామ్య వ్యవస్థలో పోలీసు దళాల పాత్ర చాలా కీలకమైనది. శాంతి భద్రతలు పరిరక్షించడం తో పాటు తీవ్రవాదం, ఉగ్రవాదం, మత ఛందస్సవాదులు, అసాంఘిక శక్తుల నుండి సామాన్య ప్రజలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు ప్రాణాలను త్యాగం చేస్తూనే ఉన్నారు. ప్రతి పోలీసు మన దేశానికి వెన్నెముక లాంటి వాడు. దేశ అంతర్గత శత్రువు, బహిరంగ శత్రువులు నుండి సామాన్య మానవులను కాపాడటంలో త్యాగాలకు సైతం సిద్ధం అవుతున్నారు. ప్రతి




మనిషి తను పుట్టినప్పటి నుండి చనిపోయే వరకు ప్రతి కదలికలో అతనిని కాపాడుటకు పోలీసులు చేయు కృషి, త్యాగం స్పష్టంగా కనబడుతుంది. చిన్న చిన్న సమస్యల నుండి ప్రకృతి వైపరీత్యాల వరకు పోలీసు సేవలు తప్పని సరి అవుతోంది. ఇప్పుడు ఎక్కడ చూసినా... అనగా బహి రంగ సభ కానీ, పరీక్షలు కానీ, ఎన్నికలు కానీ, ఏ ఇతర ర్యాలీలు తదితర సందర్భాలలో పోలీసుల సహకారం లేకుండా సాఫీగా నిర్వహించడం అసాధ్యంగా మారుతుంది. ఏ దేశమైనా, రాష్ట్రమైన ప్రశాంతంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. అభివృద్ధి జరగాలంటే సమాజం ప్రశాం తంగా ఉండాలి. సమాజం ప్రశాంతంగా ఉండాలంటే పోలీసు సేవలు తప్పనిసరి ఉండాలి. అందుకే పోలీసులు కూడా సమాజంలో భాగమని అందరూ భావించాలి. అంతేకాకుండా ప్రజలు కూడా పోలీసులకు సహకారాలు అందించాలి. చట్టవ్యతిరేక, అసాంఘిక, అరాచక శక్తులు నుండి మన దేశాన్ని రక్షించుకోవాలి అంటే తపనిసరిగా పోలీసులకు సహకరించాలి. దీంతో పాటు రక్తదానం, తదితర సామాజిక కార్యక్రమాలను చేపడుతున్నాము. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు కుటుంబాలతో సమావేశం ఏర్పాటుచేసి వారి ఆర్థిక, మానసిక పరిస్థితు లను తెలుసుకుని పోలీసుశాఖ పరంగా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కారం చేయనున్నామనీ ఇవే కాకుండా సాధారణ విధులలో భాగంగా జిల్లా ప్రజల ప్రశాంత జీవనం, శాంతి భద్రతల పరిరక్షణకు జిల్లా పోలీసు సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తుంది. జిల్లా యంత్రాంగంతో కలిసి అన్ని వర్గాల ప్రజల సహకారం తీసుకుంటూ ముందుకెళ్తున్నాము. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల నియం త్రణకు ప్రత్యేక కృషి చేసి ప్రజల ప్రాణాలను కాపాడు తున్నము. రోడ్డు భద్రతపై అవగాహన తీసుకొస్తున్నాము. మహిళల భద్రతను కీలకంగా భావించి ఆదిశగా పని చేస్తున్నాము. మహిళలపై జరిగే నేరాల కట్టడికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాము. మహిళా పోలీసు సిబ్బంది ద్వారా బాధిత మహిళలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాము. ఎడబాటులో ఉన్న సంసరాలను చట్ట పరిధిలో ఒక్కటి చేస్తున్నాము. ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం త్వరితగతిన చర్యలు తీసుకుంటున్నాం. ఫ్యాక్షన్ కట్టడి, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల అడుకట్టకు ప్రత్యేక కార్యాచ రణతో ముందుకు వెళ్తున్నాము. సాంకేతిక పరిజ్ఞానం జోడించి సీసీ కెమెరాల ఏర్పాటు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, సైబర్ సురక్ష, డయల్ 100 , సైబర్ సెల్ , తది తరాలతో ప్రజలకు సేవలందిస్తున్నాము. ఈ నేపథ్యంలో పోలీసు వ్యవస్థ ప్రజలకు తెలిపేది ఒక్కటే..... పోలీసులు కూడా మీ కుటుంబంలో ఒకరిగా బావించండి. మీకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్న పోలీసులుగా మేము ఎల్ల వేళలా అందుబాటులో ఉంటాము. మా పై విశ్వాసం పెంచుకోండి. ప్రజా సేవయే మా పరమావదిగా, ప్రజలు ప్రశాంత జీవనం గడపటం మా సంకల్పం. ప్రజలందరూ ఏదైనా పండుగలు లేదా ఇతర శుభకార్యాక్రమాలు తమ కుటుంబ సభ్యులతో జరుపుకుంటు%శీ%టే పోలీసులు మాత్రం తమ కుటుంబాలకు దూరంగా ప్రజలకు రక్షణ కల్పించడానికి, ప్రజల కోసం విధులు నిర్వహిస్తున్నారు. అహర్నిశలు కష్టపడుతున్నారు. కష్టాలలో ప్రజల వెంట ఉండి ఈ పోలీసు ఉద్యోగాన్ని మేము వరంగా భావిస్తు న్నాము. దేశ రక్షణ, భద్రత కోసం విధి నిర్వహణలో అసు వులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయక మైనవి. దేశవ్యాప్తంగా 2024-2025 సంవత్సరంలో అసాంఘిక శక్తులతో పోరాడి అన్ని పోలీసు విభాగాలకు సంబంధించిన 191 మంది పోలీసులు వారి ప్రాణాలను బలిదానం ఇచ్చారు. అందులో మన రాష్ట్రంలో కూడా ఐదుగురు పోలీసులు ఉన్నారు. మన జిల్లాలో కూడా వివిధ కారణాలతో విధి నిర్వహణలో చనిపోయిన 10 మంది పోలీసులు, హెూంగార్డులు ఉన్నారు. వీరందరికీ పేరు పేరున, జోహార్లు అర్పిస్తున్నాను. వీరి త్యాగాలు మరువలే నివి, కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు సాగాలని కోరుతున్నాము. రాబోవు రోజులో కూడా అమరవీరులను ఇలానే స్మరిస్తూ ముందుకు తాగుతామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ మాట్లాడుతూ.....జిల్లా పోలీసుశాఖలోని కారుణ్య నియమకాలు దాదాపుగా పూర్తీ చేశాం. సమాజం కోసం అహర్శిశలు శ్రమించి ప్రాణాలు సైతం లెక్కచేయ కుండా విధులు చేస్తున్న పోలీసు కుటుంబాల శ్రేయస్సు ముఖ్యం. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీసు, రెవెన్యూ శాఖలు కీలకం. ఈ రెండు శాఖలు కలసి పని చేస్తే శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల శ్రేయస్సు అభివృద్ధి సులభమవుతుంది. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు ప్రాణదానం చేస్తారు. అలాంటి పోలీసు కుటుంబాలకు ప్రభుత్వరం తరుపున ఎళ్లవేళలా అండగా ఉంటాం. కారుణ్య నియమకాలు, ఇతర బెన్ఫిట్స్ ...ఇలా ఏదైనా పరిష్కారానికి కృషి చేస్తమన్నారు.అనంతపురం రేంజ్ డి.ఐ.జి, జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ మరియు ప్రముఖులు, పోలీసు అధికారులు, విధి నార్వహణలో అసువులు బాసిన పోలీసు కుటుంబాలు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద అమర పోలీసులను స్మరించుకుంటూ పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

**అమర పోలీసులకు పేరు పేరునా నివాళులు...**

దేశ రక్షణ, భద్రత కోసం విధి నిర్వహణలో అశు వులుబాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమైన దేశవ్యాప్తంగా 2024-2025 సంవత్సరంలో అసాంఘిక శక్తులతో పోరాడి 191 మంది పోలీసులు వారి ప్రాణాలను బలిదానం ఇచ్చారు. అందులో మన రాష్ట్రం లో ఐదుగురు ఉన్నారు. జిల్లాలో కూడా అనారోగ్యం, రోడ్డు ప్రమాదం, తదితర కారణాలతో 10 మంది పోలీసులు, హెూంగార్డులు చనిపోయారు. వీరందరికీ పేరు పేరున, జోహార్లు అర్పించారు. వీరి త్యాగాలు మరువలేనివి, కుటుంబ సభ్యులు ధైర్యంగా ముందుకు సాగాలని కోరారు. రాబోవు రోజులో కూడా అమరవీరులను ఇలానే స్మరిస్తూ ముందుకు సాగుదామని డిఐజి, ఎస్పీలు పిలుపునిచ్చారు.

## మదనపల్లెలో మహిళ ఆత్మహత్య



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన మహిళ మంగళవారం మృతి చెందింది. తాలూకా పోలీ సుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, చీకలబైలు పంచా యతీ, రాగిమాకులపల్లి చెందిన శారదమ్మ (42), విశ్వనాథరెడ్డి దంపతులు కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన శారదమ్మ మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పోలీసు అమర వీరుల త్యాగాలు మరవలేనివి

- జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్
- అమరులైన వారి త్యాగాలను గుర్తించుకొని విధుల్లో పునరంకితమవుదాం: జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్





**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** దేశం సమాజం కోసం పోలీసుల త్యాగాలు మరువలేనివని, ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీస్ వ్యవస్థ ఎంతో కీలకమైందని, పోలీసుల త్యాగాలను గుర్తించుకొని విధుల్లో పునరంకితం అవుదామని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ ఎస్ . సతీష్ కుమార్ ఐపీఎస్ సంయుక్తంగా పిలుపు నిచ్చారు, దేశ రక్షణ ,సమాజ భద్రత రక్షణల కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్, ఎస్పీ పిలుపు నిచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని పోలీసు అమరవీరుల స్థూపం వద్ద పోలీసు అమరవీరుల స్మృతి పరేడ్ నిర్వహించారు. ముందుగా సాయుధ బల గాల నుండీ కలెక్టర్, ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించి అనంతరం ప్రసంగించారు. శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ప్రసంగిస్తూ... సమాజ అభివృద్ధిలో శాంతిభద్రతలు పరిరక్షించడంలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులలో వీరోచితంగా పోరాడి అసువులు బాసిన పోలీసుల త్యాగాలు మరువ లేనివని, వారికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, చేస్తున్నానన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగాలు చేస్తుంటాము కానీ, సెలవు లేకుండా 24 గంటలు పని చేసే వృత్తి ఏదైనా ఉందంటే ఒక్క పోలీసు డిపార్ట్మెంట్ అని తెలిపారు, విధి నిర్వహణలో ప్రాణాలు పోతాయి అని తెలిసినా కూడా మొక్కబోని ధైర్యంతో పనిచేస్తుంటారని వారి సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. పరాయి దేశం నుంచి శత్రు దుర్భిద్యాలు వల్ల యుద్ధం వస్తే సైనికులు ఏ విధంగా పోరాడుతారో అంతర్గత భద్రత కోసం పోలీసులు కూడా అదే విధంగా విధులు నిర్వర్తిస్తారని కొనియాడారు. నక్సలిజం, మాఫియా వంటి వాటిని నిర్మూలించడంలో కీలక పాత్ర పోలీసులదే అన్నారు. ప్రతి ఒక్కరికి పండగ అంటే సెలవు ఉంటుంది కానీ పోలీసులకు మాత్రం ఉండదని, విధి నిర్వహణలో ప్రజల అభ్యున్నతి కోసం పోరాడుతూ ఉంటారన్నారు. క్రమశిక్షణకు మారుపేరు పోలీస్ అన్నారు. పోలీస్ అంటే ఒక రక్షణ, ఒక భద్రత, ఒక సేవ చేసే గుణమన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తూ, ప్రజలతో న్యాయంగా స్నేహపూర్వకంగా వ్యవహరిద్దాం, దేశభద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉందామని ఒక సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ తీసుకుందామని కలెక్టర్ శ్యాంప్రసాద్ గారు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా అమరులైన పోలీస్ కుటుంబా లకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేసి, అమరులైన పోలీసులకు ఘన నివాళులర్పిస్తున్నానని కలెక్టర్ తెలి పారు. జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ ప్రసం గిస్తూ... అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తించుకొని విధుల్లో పునరంకితమవుదామని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఐపిఎస్ పిలుపు నిచ్చారు, ప్రతి సంవత్సరం అక్టోబర్ 21వ తేదీన పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. దీనిని ఎందుకు చేసుకుంటున్నామంటే.. 1959 సంవత్సరం అక్టోబర్ 21 న లడక్ ప్రాంతంలో మన దేశ మిలటరీ బలగాలకు చైనా దళాలకు భీకర యుద్ధం జరిగింది. ఇందులో డిఎస్పి ర్యాంక్ ధరమ్ సింగ్ తో పాటు పది మంది సిఆర్పిఎఫ్ బలగాలు చైనా వారితో పోరాడుతూ వీరమరణం పొందారన్నారు. అప్పటి నుండీ ప్రతీ ఏటా సంస్మరణ దినం జరుపుకుంటున్నాం. అప్పటి నుంచి దేశంలో అంతర్గత భద్రత కల్పిస్తు మావోయిస్టులు, టెర్రరిస్టులు, నక్సనిజాన్ని రూపుమాపడంలో పోరాడి వీరమరణం పొందిన ప్రతి ఒక్కరి అక్టోబర్ 21వ తేదీన గుర్తిస్తూ సంస్మరణ దినోత్సవం గా జరుపుకుంటున్నా మన్నారు. 1- 9- 2024 నుంచి 31- 8- 2025 వరకు మనదేశంలో 191 మంది పోలీసులు అమరు లయ్యారన్నారు. ఇందులో మన ఆంధ్రప్రదేశ్ నుంచి 5,మంది, ప్రాణత్యాగం చేశారన్నారు. వీరి త్యాగాలు మరువలేనివని, వారి కుటుంబాలకు తన ప్రగాఢ సాను భూతి తెలుపుతున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పండుగ సమయంలో పండుగలు చేసుకుంటుంటే మనము మాత్రం వారి రక్షణ కోసం పోరాడుతూ ఉంటా మని గర్వంగా చెప్పారు. అమరులైన ప్రతి కుటుంబం తమలో ఒక భాగమని, వారికి రావలసిన ప్రతిఫీ అందేలా చూస్తామన్నారు. ఈ సంస్మరణ దినోత్సవంలో ఇదే ముఖ్య ఉద్దేశమన్నారు. విధి నిర్వహణలో పోలీసులు ఎన్నో త్యాగాలు చేసి సేవలు అందిస్తున్నారు. ఈక్రమంలో ప్రాణాలొదిన ప్రతీ అమర పోలీసులకు నివాళులు అర్పిస్తున్నా మన్నారు. ప్రజా సంరక్షణ ధ్యేయంగా ముందు కెళ్తున్నామని ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి నివారణకు కృషి చేస్తున్నామన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అమరవీరులను పేరుపేరునా స్మరించుకోవడంతో పాటు వారి సేవలను గుర్తించి ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. శిబిరాలు పోలీసుల త్యాగాలు తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రాల ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. త్యాగాలు స్మరించుకుంటూ ముందుకు సాగుదాం అని ఎస్పీ సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. అనంతరం అమర పోలీసులను స్మరించుకుంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

**కారుణ్య నియామకం పత్రాలు , చెక్కు అందజేసిన కలెక్టర్ ఎస్పీ**

పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక కింద హెూంగార్డులుగా నియమిస్తూ వారి కుటుంబ సభ్యులకు జిల్లా కలెక్టర్ ,ఎస్పీ నియామక పత్రాలను అందజేశారు. వీరిలో.. అంజలి కుమారి భర్త కిరణ్ కుమార్, ఏ ఆర్ పి సి 1828, వైష్ణవి , తండ్రి నాగభూషణం, హెడ్ కానిస్టేబుల్ 335, పద్మజ భర్త హరికుమార్ ఏ ఆర్ పి సి,2659 ఉన్నారు. అలాగే ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన సిఐ ,పావని కుమార్ కుటుంబానికి రూ,10,000 ల చెక్కును అందజేశారు. ప్రత్యేక చొరవ తీసుకుని కారుణ్య నియామకం పత్రాలు అందజేసిన జిల్లా ఎస్పీకి రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం మరియు సభ్యులు సూర్యకుమార్ పోలీస్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు అమర వీరుల కుటుంబాలలో ఏవైనా సమస్యలున్నా, తమ దృష్టికి తీసుకురావాలని , ఎస్పీ తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే, మాజీ మంత్రి మరియు అధికారులు పోలీసు అమరవీరుల స్థూపం వద్ద అమర పోలీసులను స్మరించుకుంటూ పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. ఈకార్యక్రమంలో కలెక్టర్, ఎస్పీ తో పాటు, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ,మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, ఆర్డీవో సువర్ణ , ఏవో సుజాత, ఏఆర్ డి ఎస్ పి, శ్రీనివాసులు, డీఎస్పీలు విజయకుమార్, నరసింగప్ప, హేమంత్ కుమార్, ఆదినారాయణ, ఎస్బి సిఐ వెంకటేశ్వర్లు, ఆర్ ఐ వలి, మహేష్, రవికుమార్,రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం సభ్యులు సూర్యకుమార్, సిఐలు సురేష్, శ్రీనివాసులు , శివాంజ నేయులు, ఆర్ఎస్ఐలు వీరన్న ,వెంకటేశ్వర్లు ,ప్రదీప్ సింగ్, ప్రసాద్ , పోలీస్ కుటుంబాలు, సిబ్బంది పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.





## 14వ బెటాలియన్‌లో కారుణ్య నియామకాలు



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** అనంత పురంలోని జంతలూరు గ్రామంలోని 14వబెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం సందర్భంగా బెటాలియన్‌లో పనిచేసిన ఇద్దరి పోలీసు కుటుంబాలకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు కల్పించారు. 14 వ బెటాలియన్ కమాండెంట్ ప్రభు కుమార్ చొరవ తో మంగళవారం నాడు అమరవీరుల సంస్మరణ దినం వేడుకలో వారి కుటుంబాలకు నియామక పత్రాలు అందించారు.రెడ్ శాండల్ మాఫియా చేతిలో వీరమరణం పొందిన బిల్లి గణేష్( పి.సి 166) తమిళనాడు ఎలక్షన్ డ్యూటీ లో ఆరోగ్యం బాగాలేక అనారోగ్యంతో మరణించిన ఉదయ్ భాస్కర్ (పి.సి 760) ఇద్దరు కానిస్టేబుళ్ల కుటుంబాలకు కారుణ్య నియామకాలు ఉత్తర్వులను అడిషనల్ కమాండెంట్ కేశవ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.



ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ కమాండెంట్ మహబూబాషా, రిజర్వ్ ఇన్స్పెక్టర్ నాగేంద్ర, రామారావు, రాఘవేంద్ర, జగదీష్ , బెటాలియన్ వెల్ఫేర్ ఆఫీసర్ ఆర్ఎస్ఐ శ్రీధర్, లైజనింగ్ ఆఫీసర్ ఆర్ఎస్ఐ నవీన్ కుమార్, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దయ్య, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొన్న ద్విచక్ర వాహనం

- బాలిక మృతి, ముగ్గురికి గాయాలు

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** మండలంలోని హిందూపురం రోడ్డులో గల మల్లాపల్లి వద్ద జరిగిన ఆటోను ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో 9 ఏళ్ల బాలిక మృతి చెందగా,మరో ముగ్గురు గాయపడిన సంఘటన చోటుచేసుకుంది, సీఐ బోయ శేఖర్ తెలిపిన వివరాల మేరకు... గోరంట్ల పట్టణం లో కాపురం ఉంటున్న దాదా కలందర్ తన కుమార్తె మెహతాజ్ (9)తో కలిసి పెనుకొండ లోని బంధువుల ఇంటికి తన ఆటోలో వెళుతూ వడిగే పలికి చెందిన గంగరత్నమ్మ, మరియు పాల సముద్రం గ్రామానికి చెందిన ఎరుకల శాంతమ్మ లను బస్టాండ్ లో ఎక్కించుకొని మల్లాపల్లి దాటగానే పాలసముద్రం నుండి గోరంట్ల కు చిలమ తూరు మండలం లోని బండ్లపల్లి గ్రామానికి చెందిన గంగి రెడ్డి అను వ్యక్తి తన ఏ పి 02 బి ఎఫ్ 9878 ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి ఆటోను ఢీ కొట్టిన సంఘటన లో మెహతాజ్ తలకు తీవ్ర గాయాలు కావడంతో తీవ్రంగా గాయపడగా,మరో ముగ్గురు గాయపడ్డారు. దీంతో మెహతాజ్ ను మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు,కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### స్వాతంత్ర్య సంగ్రామంలో ఉరికంభం ఎక్కిన
## అమరవీరుడు అష్ఫాఖుల్లా ఖాన్

- మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ షిబ్లీ



**విజయవాడ, సూర్య.వాస్తవం, అక్టోబర్ 21:** మాతృ భూమి స్వాతంత్ర్య సంగ్రామంలో ఉరికంబం ఎక్కిన అమరవీరుడు అష్ఫాఖుల్లా ఖాన్ అని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్ షిబ్లీ అన్నారు. అమరవీరుడు, స్వాతంత్ర సమరయోధుడు అష్ఫాఖుల్లా ఖాన్ 125వ జయంతి సందర్భంగా విజయవాడ లోని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అష్ఫాఖుల్లా ఖాన్ చిత్రపటానికి పూలమాల వేసిఘనంగానివాళులర్పించారు. ఈ సందర్భంగా ఫరూఖ్ షిబ్లీ మాట్లాడుతూ.. మాతృభూమి విముక్తి కోసం ప్రాణాలను తృణప్రాయంగా భావించి బ్రిటిష్ వలస పాలకులపై విప్లవ శంఖారావం పూరించిన అష్ఫాఖుల్లా ఖాన్ 1900 అక్టోబర్ 22న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, షాజహాన్‌పూర్ లోని సంపన్న జమీందారి కుటుంబంలో జన్మించారని ఆయన చెప్పారు. తల్లితండ్రులు మజహరున్నిసా బేగం, షఫీఖుల్లాఖాన్. చిన్ననాటి నుండే మంచి చదువరి అయిన తల్లి నుండి సాహిత్యాభిలాష పెంచుకున్న అష్ఫాఖ్ ఉర్దూ కవిగా రూపొందించారని ఆయన తెలిపారు. 1925 ఆగష్టు 9న కాకోరి గ్రామం మీదుగా వెళ్ళే మెయిల్‌లో తరలిస్తున్న ప్రభుత్వ ఖజానాను కైవసం చేసుకునేందుకు రూపొందిన పథకాన్ని విజయవంతం చేయడంలో అష్ఫాఖ్ ప్రధాన పాత్రను పోషించారు. ఆసంఘటనతో ఒక్కసారిగా ఖంగుతిన్న బ్రిటిష్ ప్రభుత్వం విప్లవకా రుల మీద విరుచుకపడిరది. 'హిందూస్దాన్ రిపబ్లికన్ అసోసియేషన్' సభ్యుల అరెస్టులు సాగించింది. అష్ఫాఖుల్లా ఏడాదిపాటు అజ్ఞాత జీవితం గడిపిన పిదప స్వగ్రామానికి చెందిన మిత్రద్రోహి కారణంగా ఢల్లీలో అరెస్టయ్యారు. ఈ కాకోరి రైలు సంఘటన విచారణ సమయంలో నాయకుడు రాంప్రసాద్ బిస్మిల్‌ను శిక్ష నుండి తప్పించేందుకు ఆయన శతవిధాల ప్రయత్నించారని ఆయన కొనియా డారు. కాకోరి రైలు సంఘటనకు పూర్తి బాధ్యత తనదంటూ న్యాయవాది సలహాకు భిన్నంగా ప్రీవికౌన్సిల్‌కు రాతపూర్వకంగా తెలిపారు. అంగ్ల న్యాయస్థానం అష్ఫాఖ్‌కు ఆయన సహచరులు మరో ముగ్గరికి ఉరిశిక్షలు విధిస్తూ తీర్పు ప్రకటిం చింది. ఆ ఉరిశిక్ష అమలు కోసం ఎదురు చూస్తూ జైలులో గడిపిన ఆయన 'నా మాతృభూమి సర్వదా భోగభాగ్యాలతో విలసిల్లాలి. నాదేముంది నేను ఉండొచ్చు, ఉండక పోవచ్చు' అంటూ ఆకాంక్ష వ్యక్తంచేశారని ఆయన తెలిపారు.చివరకు 1927 డిసెంబర్ 19న ఉత్తరప్రదేశ్ లోని ఫైజాబాద్ జైలులో ఉరిశిక్షను ఆనందంగా ఆహ్వానించిన అష్ఫాఖుల్లా ఖాన్ చిరస్మరణీయుల య్యారు.ఈ కార్యక్రమంలో షేక్ బాబు, షేక్ వలి, ఫరీద్, షమ్మీ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు కురబలకోట మండలం, తెట్టు పంచాయతీ, చింతయ్యగారి కోటకు చెందిన రవి కుమారుడు తేజ (19),, రాధాకృష్ణ కుమారుడు జగదీష్ (21)లు ద్విచక్ర వాహనంలో పుంగనూరు రోడ్డులో ఉన్న కనుమలో గంగమ్మగుడి కి బయలుదేరారు. ఇదే సమయంలో మదనపల్లె మండలం, వేంపల్లి దళితవాడకు చెందిన సంతోష్, ప్రేమ్ కుమార్ ద్విచక్ర వాహనంలో పుంగనూరు రోడ్డు నుంచి మదనపల్లె వైపు వెళ్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు స్థానిక బైపాస్ రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తేజ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు బాధితులకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## కాంగ్రెస్ సీనియర్ నాయకుడికి పరామర్శ

**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** కలేకుర్తి జయరాం రెడ్డిని పరామర్శించిన రాయదుర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి. మంగళవారం కనేకల్ పట్టణము నందు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు క్లాస్ 1 కాంట్రాక్టర్ కలేకుర్తి జయరాం రెడ్డి అనారోగ్య కారణంగా బెంగళూరు కార్పొరేట్ ఆసుపత్రి నుండి ట్రీట్మెంట్ తీసుకొని ఇంటికి వచ్చిన సందర్భంగా కనేకల్ లోని వారి నివాసములో రాయదుర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు,జడ్పీటీసీలు సర్పంచులు , కో ఆప్షన్ నెంబర్ చిన్న సర్మాన్ మరియు కనేకల్ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు ఇతర విభాగాల అనుబంధ అధ్యక్షులు పాల్గొన్నారు.



Truth of News
RNI NO : APTEL/25/A0239
సూర్య వాస్తవం
http://www.suryavastavam.in



## ఆస్తికోసం భార్యను చంపేశాడు!



**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ఆస్తికోసం కట్టుకున్న భార్యను అంతమొందించాడు ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. బాధ్యతాయుత పదవిలో కొనసాగి, రిటైర్డ్ అయ్యి, జీవిత చరమాంకంలో ఆస్థికోసం భార్యపై కక్ష్య పెంచుకొని తన తమ్ముడితో కలిసి భార్యపై యాసిడ్ దాడి చేసి అంత మొందించాడు. 15 రోజుల పాటు మృతువుతో పోరాడిన ఆమె మంగళవారం అసువులు బాసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, శేషప్పతోటకు చెందిన రమణ బిఎస్ఎఫ్ లో డిఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. ఇతనికి భార్య శశికల(52) కుమారుడు సృజన్, కుమార్తె సాత్విక వర్షణి లు ఉన్నారు. కాగా కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తలలు కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. దీంతో శశికళ ఇద్దరు పిల్లలతో కలిసి శేషప్ప తోటలోని సొంత గృహంలో ఉండగా, రమణ తన స్వగ్రామమైన నిమ్మనపల్లి మండలం నాగంవారిపల్లెకు వెళ్ళిపోయి, అక్కడే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఇంటిని తన పేరు రాయాలని భార్యను వేధింపులకు గురి చేస్తూ వస్తున్నాడు. అయితే ఈ ఇల్లు పిల్లలకే చెందుతుందని, నీ పేరు రాయనని శశికళ పట్టుబడుతూ వచ్చింది. ఇది ఇలా ఉండగా ఈనెల 6వ తేదీ రమణ తమ్ముడు రాజన్న తో కలిసి శేషప్పతోటలో ఉన్న భార్య ఇంటికి వచ్చాడు. భార్య పూజలు చేసుకుంటుండగా వెళ్లి ఆమెను బలవంతంగా పట్టుకొని, నోటిలో యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే అడ్డుకొని బాధితురాలని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. దీంతో రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవను పునరుద్ధరించాలి

- డీసీసీ అధికార ప్రతినిధి, ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్



**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ప్రజాసేవలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉచిత వైద్య సేవ ఎన్టీఆర్ వైద్య సేవ విషయంలో కూటమి ప్రభుత్వం వెనకడుగు వేసిందని డిసిసి అధికార ప్రతినిధి ఆడిటర్ మన్సూర్ అలీ ఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక నెల క్రితం ఓపి సేవలు ఎత్తేసింది. 11 రోజుల క్రితం ఇన్ పేషెంట్ సేవలు నిలిపివేసింది. ఇప్పుడు అత్యవసర సేవలు కూడా నిలిపివేయడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆ ప్రకటనలో తెలిపారు. పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు లక్షలకు లక్షలు బిల్లులు చెల్లించలేక, వైద్యం చేయించుకోవడం కష్టతరంగా మారిందని ఆయన తెలిపారు. దీనివలన వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతున్నది. కొందరైతే ప్రాణాల మీద ఆశతో లక్షలకు లక్షలు అప్పులు చేసి వైద్యం చేయించుకుంటున్నారు. దీనివలన వారి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడుతున్నది ఎంతో గొప్ప టెక్నాలజీ తెలిసిన హైటెక్ ముఖ్యమంత్రి చంద్రబాబుఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు ప్రజలకు సమాధానం చెప్పాలి. వైద్య సేవలు అందక ప్రాణాలు పోతే కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది ప్రజల ప్రాణాలతో చెలగా మాట చెలగాట మాడకుండా వెంటనే ఎన్టీఆర్ వైద్య సేవ ఆరోగ్య శ్రీను కొనసాగించాలని ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

## దీపావళి వేడుకలు

- కుటుంబసభ్యులతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి



**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబ సభ్యులతో దీపావళి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఈ దీపావళి ప్రతి ఒక్కరి జీవితాలలో వెలుగులు నింపాలని అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ ఆకాంక్షించారు. దీపావళి సందర్భంగా హైదరాబాద్ లోని నివాసంలో, తన కుటుంబసభ్యులతో కలిసి దీపావళి వేడుకలలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. ఉదయం తన నివాసంలో లక్ష్మిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ జగన్మాత ఆశీస్సులతో ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరుకున్నారు.



# పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

### మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎస్పీ ధీరజ్ భరోసా - ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం





**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** అన్నమయ్య జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో రాయచోటి పోలీసు పరేడ్ మైదానంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అత్యంత ఘనంగా, భావోద్వేగాల మధ్య నిర్వహించారు. దేశ సేవలో అమరులైన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ.. పుష్ప గుచ్చాలతో అంజలి ఘటించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన క్రీడల శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు విశిష్ట అతిథిగా విచ్చేసి అమరవీరుల త్యాగాలను కొనియాడారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రశాంతమైన సమాజం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన పోలీసు అమర వీరులందరికీ నా తరపున మరియు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను. వారి సేవ వెలకట్టలేనిది. పోలీసులు తమ కుటుంబాలను వీడి, ప్రమాదాలను లెక్క చేయకుండా ప్రజల రక్షణకు నిలబడటం అసాధారణమైన ధైర్యం. ఎస్పీ గారు చెప్పినట్లుగా, 'భయం ఉన్నప్పటికీ చర్య తీసుకోవడం' పోలీసులకే సాధ్యం. వారి త్యాగాల పునాదులపైనే మన రాష్ట్రం మరియు దేశం శాంతిభద్రతలతో ఉంది. పోలీసు అమరవీరుల కుటుంబాలు ఒంటరి కాదు. వారు చేసిన మహత్తర త్యాగానికి గుర్తింపుగా, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం ద్వారా వారి అవసరాలు తీర్చడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. యువతరం వారికి స్ఫూర్తిగా నిలవాలి. మన పోలీసులు కేవలం చట్టాన్ని అమలు చేసేవారు మాత్రమే కాదు, వారు సమాజానికి రక్షకులు. ప్రతి పౌరుడు వారికి సంఘీభావం తెలపాలి, వారి సేవను గౌరవించాలన్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ మాట్లాడుతూ "ధైర్యం అంటే భయం లేకపోవడం కాదు, భయం ఉన్నప్పటికీ చర్య తీసుకోవడం. అది పోలీస్ కి మాత్రమే సాధ్యం." ఈ రోజు మనం కర్తవ్య నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరులను గౌరవించడానికి సమావేశమయ్యాము. పోలీసు స్మృతి దినోత్సవం కేవలం తేదీ కాదు - ఇది శాంతి యొక్క వెల మరియు ధైర్యం యొక్క మూల్యాన్ని గుర్తుచేసే పవిత్రమైన దినం. కోవిడ్-19 సమయంలో తనకంటే కర్తవ్యాన్ని ముందుంచి, మన పోలీసులు కనిపించని శత్రువుతో పోరాడారు. లాక్‌డౌన్‌ల సమయంలో ప్రజల భద్రతను నిర్ధారిస్తూ చాలామంది ప్రాణాలు కోల్పోయారు. వీరత్వం అనేకరూపాల్లో వస్తుందని వారు నిరూపించారు. 1959లో లధాఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్‌లో అసువులు బాసిన 10 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల త్యాగం నుంచే ఈ దినోత్సవం మొదలైంది. ప్రతి సంవత్సరం ఈ రోజు వారి వీరత్వాన్ని, వారి వారసత్వాన్ని గుర్తుచేస్తుంది. ఒక సంవత్సరంలో దేశవ్యాప్తంగా 191 మంది పోలీసులు మరణించారు. వీరిలో మన రాష్ట్రానికి చెందిన 2 గురు సభ్యులు కూడా ఉన్నారు. ఈ సంవత్సరం అన్నమయ్య జిల్లాకి చెందిన 8 మంది పోలీసులు వివిధ కారణాలవల్ల ప్రాణాలు కోల్పోయారు. మన వీధులను, మన సరిహద్దులను రక్షిస్తూ పడిపోయిన వారి త్యాగం వృథా కాలేదు - అది నిరోధించబడిన ప్రతి నేరంలో, రక్షించబడిన ప్రతి బాధితుడిలో జీవిస్తోంది. వారు గౌరవంతో సేవ చేశారు. వారు గౌరవంతో మరణించారు. వారు మన జ్ఞాపకాలలో ఎల్లప్పటికీ జీవిస్తారన్నారు.

**అమరవీరుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేత**

కార్యక్రమంలో భాగంగా, అమరులైన పోలీసు కుటుంబ సభ్యులకు విశిష్ట అతిథి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారు మరియు ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ గారు అవసరాల నిమిత్తం ఆర్థిక సహాయం అందజేశారు.

**అమరవీరుల కుటుంబాలకు ఎస్పీ ప్రత్యేక భరోసా సమావేశం**

కార్యక్రమం అనంతరం, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ విధి నిర్వహణలో మరణించిన పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులతో జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పోలీసు అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటాం. విధి నిర్వహణలో వారు చేసిన త్యాగాలు, సేవలే పోలీసు శాఖను ఉన్నత స్థానంలో నిలిపాయి. ప్రభుత్వం పరంగా అందాల్సిన సౌకర్యాలు (బెనిఫిట్స్), కుటుంబ స్థితి గతులు, బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వ్యక్తిగత సమస్యలైనా, ఇతర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని భరోసా ఇచ్చారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి నాకు తెలియజేయాలని" ఎస్పీ గారు హామీ ఇచ్చారు. మృతి చెందిన పోలీసు కుటుంబాల సమస్యలను తెలుసుకొనేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఐఏఎస్ , అదనపు ఎస్పీ (పరిపాలన) యం. వెంకటాద్రి , రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామనాథ్ హెగ్డే ఐపీఎస్ , మదనపల్లి డీఎస్పీ యస్. మహేంద్ర , రాయచోటి డీఎస్పీ ఏం.ఆర్. కృష్ణమోహన్ , ఏఆర్ డీఎస్పీ . శ్రీనివాసులు డీఆర్వో మధుసూదన్ రావు , జిల్లాలోని సీఐలు, ఆర్ఐ లు, ఎస్ఐ లు, ఆర్ ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది, పోలీసు సిబ్బంది, హోంగార్డు సిబ్బంది, మరియు అమరవీరుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అమ్మో మహిళలనే ముంచేస్తున్న మాయలేడి..!

### సంఘమిత్ర ముసుగులో రూ.39 లక్షలు స్వాహా
### స్త్రీనిధి డబ్బు కాజేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు
### మాయలేడిని విచారిస్తున్న మదనపల్లె తాలూకా పోలీసులు






**మదనపల్లె, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ఆమె సాటి మహిళల కష్టార్జితాన్ని స్వాహా చేసి కాజేసిన ఓ మాయలేడి. 32 మహిళా సంఘాల గ్రూపులకు ఆ మాయ లేడిదే సారాజ్యం(ప్రతినిది). సంఘమిత్ర ముసుగులో 32 గ్రూపుల్లో ఉన్న 320 మంది మహిళలను బురిడీ కొట్టించి, ఎవరికి తెలియకుండా వారి పేరు మీదనే రూ.39 లక్షలు స్త్రీనిధి నిధులు కాజేసి స్వాహా చేసింది. బ్యాంకర్లు గ్రూపుల్లో ఉన్న మహిళ సభ్యులకు నోటీసులు ఇవ్వడంతో బెంబేలెత్తిన మహిళలు ఏమి జరిగిందో తెలుసుకోలేక లబో దిబో మంటూ మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ కు పరుగులు పెట్టి తమకు న్యాయం చేయాలని అర్థిస్తున్నారు. ఈ ఉదంతం మంగళవారం మదనపల్లె మండలంలో వెలుగు చూసి, తీవ్ర కలకలం రేపింది. బాధితులు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. మదనపల్లె మండలం, సిటిఎం పంచాయతీ రేగంటివారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య స్వాతి సంఘమిత్రగా విధులు నిర్వహిస్తోంది. ఈమె పరిధిలో 32 గ్రూపులకు చెందిన 320 మంది మహిళలు ఉన్నారు. ఈమె గత కొంత కాలంగా సభ్యులకు తెలియకుండా వారి పేరు మీదనే స్త్రీ నిధి డబ్బులు డ్రా చేసుకుంది. సుమారు రూ.39 లక్షలు సభ్యుల పేరు మీద బ్యాంకులో చెక్కులు వేసి డబ్బులు డ్రా చేసుకొని కాజేసినట్లు బాదితులు ఆరోపిస్తున్నారు. బ్యాంకులకు ఈ మొత్తం రికవరీ కాకపోవడంతో గత కొంత కాలంగా ఈ 32 గ్రూపుల్లోని సభ్యులకు నోటీసులు పంపారు. దీంతో ఏమి జరిగిందో ఏమో తెలియని సభ్యురాల్లు తెలిసిన వారిని ఆరా తీయగా స్త్రీనిధి నుంచి మీరు ఇంత మొత్తంలో డబ్బులు తీసుకున్నారని, తిరిగి చెల్లించక పోవడంతో నోటీసులు వచ్చాయని వారు వివరంగా చెప్పారు. దీంతో ఖంగు తిన్న సభ్యులు పరుగు పరుగున పోలీస్ స్టేషన్ కు వెళ్లి పోలీసులను ఆశ్రయించారు. సంఘమిత్ర స్వాతి తమ పేరు మీద స్త్రీనిధి డబ్బులు డ్రా చేసి రూ. 39 లక్షలు కాజేసిందని, బ్యాంకర్లు తమకు నోటీసులు పంపారని లబోదిబోమన్నారు. దీంతో స్పందించిన తాలూకా ఎస్సై చంద్రమోహన్ సంఘమిత్ర స్వాతిని స్టేషన్ కు పిలిపించారు. ఏమి జరిగిందని ఆరా తీశారు. వివరాలను సీఐ కళా వెంకటరమణ కు నివేదించారు. దీంతో సిఐ దర్యాప్తు ప్రారంభించారు. బాధ్యతగా పని చేయాల్సిన సంఘమిత్ర గ్రూపు సభ్యులను బురిడీ కొట్టించి వారి పేరు మీద రూ.39 లక్షలు శ్రీనిధి డబ్బులు కాజేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు పారదర్శకంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

# ఒక మంచి తెలుగు సినిమా



ప్రసిద్ధ రచయిత్రి ఓల్గా కథ, మాటలు, పాటలు అందించగా, కుటుంబరావు దర్శకత్వం వహించగా, పోపూరు హిమాంశు నిర్మించారు. ఈటీవీ విన్‌లో విడుదలైంది. రోజూ మనం వింటున్న కథే. మన ఇండ్లలోనూ జరుగుతున్న కథే. ఏం చేయాలో అర్థంకాక సతమతమవుతున్న వ్యథే. అలాంటి వస్తువునే తీసుకుని చాలా గొప్పగా చర్చించి, పరిష్కరించి ప్రేమకథను చేశారు రచయిత్రి. సినిమాలు సమాజాన్ని ప్రతిబింబిస్తాయని సాధారణంగా అంటుంటారు. ప్రతిబింబించటమే కాక ప్రతి కూలంగా, విపరీతంగానూ మారింది, అది వేరే విషయం. కానీ ఈ సినిమా సమాజంలో సమస్యగా మారిన అంశాన్ని తీసుకుని, శాస్త్రీయంగా విశ్లేషించి, సృజనాత్మకంగా తీర్చిన చిత్రం ఇది. పెట్టుబడిదారీ సమాజంలో సాంకేతికత విపరీతంగా అభివృద్ధి చెందుతుంది. అందులో ఐటి, సాఫ్ట్‌వేర్ రంగం పెరిగిపోయిన సందర్భంలో మధ్య తరగతి సమూహాలు వీటిని బాగా అందిపుచ్చుకుని ఎదిగారు.
ఈ ఎదుగుదలలో ఒత్తిడిలో కుంగుబాటూ ఎదిగింది. పెట్టుబడికి లాభం తప్ప మరే సంబంధమూ ఉండదు. అది మనుషుల శరీరాలను, మనుషుల మధ్య మానవీయ సంబంధాలనూ అన్నిటినీ ధ్వంసం చేస్తుంది. ఆ విధ్వంసంలో మనమంతా ఉంటాం. అందులోంచి వచ్చిన ఒక సమస్య.. తల్లిదండ్రులు ముసలి వాళ్లయ్యాక వారిని చూసుకోవడం. ప్రేమను పంచి, పెంచిన వారిని చివరి మజిలిలో ప్రేమగా చూసుకోవడం ఇపుడంతటా మాయమైపోయింది. ఉద్యోగం పేరుతో విదేశమో, వేరే రాష్ట్రమో వెళతారు. భార్యాభర్తలూ ఉద్యోగం చేయటమూ అవసరమవుద్ది. ఒక్క తల్లిదండ్రులనే కాదు, పిల్లలనూ చూసుకోవడమూ మానేసారు. ఈ విషయాలన్నిటినీ చాలా హృద్యంగా దృశ్యమానం చేశారు.
పనుల్లో పడి, సంపాదనల్లో పడి, ఒత్తిళ్ళలో పైపైకి పోవాలనే ఆరాటంలోపడి పోగొట్టుకుంటున్నదేమిటి?. జీవితంలో మిగలాల్సిన మధురమైన జ్ఞాపకాలకు అవకాశం ఇస్తున్నామా?, ఎవరినో చూసుకోవడం కాదు, మనకు మనం మిగులు తున్నామా?.. ఇవీ ప్రశ్నలు. సమూహపు మానవ సంబంధాల్లోంచే మనుషులుగా రూపుదిద్దు కున్నాము. కానీ మనల్ని మనమే కోల్పోతూ ఒంటరిగా మిగులుతున్న తీరును ఈ ప్రేమకథలో ఎంతో సున్నితంగా స్పష్టంగా ఎరుకపరుస్తారు. విషయం మనల్ని వెన్నాడుతున్నదే కావచ్చు. చెప్పిన విధానం చాలా గొప్పగా ఉంది. కథాంశానికి సంబంధించిన సన్నివేశాలలో సంభాషణలు మనల్ని వెన్నాడుతూ ఉంటాయి. అనేకానేక మానసిక సమస్యలకు, డిప్రెషన్స్‌కు డాక్టర్స్ సైతం ప్రిస్క్రైబ్ చేసింది ప్రేమ ఒక్కటే. అది మందుల షాపులో దొరికేదికాదు. లవ్ పిల్స్ ఇంకా ఎవరూ కనిపెట్టలేదు. అన్ని డిఫిసియెన్సీలలాగే 'లవ్ డిఫిసియెన్సీ' ఒకటని రాసిన మాటలు ఆకట్టుకుంటాయి. పిల్లల్ని కని పెంచడానికి కంపెనీలు సెలవులు ఇస్తాయి. అవి కూడా పోరాడే సాధించుకున్నారు. మరి తల్లిదండ్రుల్ని చూసుకోవడానికి సెలవులెందుకు ఇవ్వరు? అనే ప్రశ్నలకు ఒక అవగాహనతో సమాధానాన్ని సంభాషణల్లో నడిపించడం ఓల్గాకే సాధ్యపడింది. ఈ చిన్న సినిమాలోనే స్త్రీ, పురుష సంబంధాల గురించి, కుల సమస్యను గురించి, ఆత్మగౌరవాల గురించి కూడా సినిమా చర్చిస్తుంది.
ఇందులో తల్లిలా ప్రధాన పోషించిన రోహిణి అట్టంగడి చాలా అద్భుతంగా నటించారు. కూతురు సుజాతగా పాత్ర పోషించిన ప్రముఖ నటి రోహిణి నటన గురించి చెప్పాల్సిన పనిలేదు. సముద్రఖని పాత్రలో ఒదిగిపోయారు. అందరూ చాలా సహజంగా నటించారు. సంగీతం బాగుంది. కథను తెరకెక్కించిన దర్శకులు కుటుంబరావు అనవసర సన్నివేశాలకు తావివ్వకుండా కథను బాగా నడిపించడంలో విజయం సాధించారు. అయితే కథలో భాగంగా కొంత హాస్యాన్ని జోడిస్తే బాగుండనిపిస్తుంది. ఉన్నత అభిరుచిగల పాఠకులకు ఉత్తమ చిత్రమిది. అంతేకాక ఉత్తమ పాఠక అభిరుచులను పెంచే చిత్రం కూడా. ప్రజలందరూ చూడాల్సిన చిత్రం "ఒక మంచి ప్రేమకథ".

**ప్రేమకథలు కాని తెలుగు సినిమాలు చాలా తక్కువ. ప్రతి సినిమా ఇద్దరు ప్రేమికుల చుట్టూ అల్లుకునేదే కదా! విషాద సుఖాంతాలే కాక, ఎన్నో ఎన్నో మలుపులు, మెరుపులు కోకొల్లలు. ఊహలు, మోహాలు, వన్‌సైడ్, మల్టీసైడ్ ప్రేమలు, డ్యూయెట్లు, ఫైట్లు అబ్బో.. ఇంకా ఐటెం సాంగ్స్, ఊహించని క్లైమాక్సు ఒక్కటేమిటి?.. అన్నన్ని ఉన్నా ఇప్పటి సినిమాలు హృదయాన్ని ఇసుమంతా కదిలించవు. అసలు అక్కడిదాక వెళ్ళనే వెళ్ళవు. అంతేకాక వాస్తవిక జీవితపు ఏ పార్శ్వమూ ఏ మాత్రమూ కనిపించదు. అలాంటి సినిమాలకు భిన్నంగా.. ఒక ప్రత్యామ్నాయ సినిమాను తెలుగు తెరకెక్కించారు అక్కినేని కుటుంబరావు. అదే, "ఓ మంచి ప్రేమకథ".**

## యాక్షన్ థ్రిల్లర్‌గా 'ది బ్లాక్ గోల్డ్'



నాయిక సంయుక్త నటిస్తున్న ఫస్ట్ ఫిమేల్ సెంట్రిక్ ఫిల్మ్ 'ది బ్లాక్ గోల్డ్'. యోగేష్ కెఎంసి దర్శకత్వం వహిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని 'సామజవరగమన,
ఊరు పేరు భైరవకోన, కె-ర్యాంప్' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన నిర్మాత రాజేష్ దండా నిర్మిస్తున్నారు. హాస్య మూవీస్, మాగంటి పిక్చర్స్‌తో కలిసి చేస్తున్న ఆరవ సినిమా ఇది. సంయుక్త స్వయంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. సింధు మాగంటి సహ నిర్మాత. దీపావళి సందర్భంగా చిత్రానికి సంబంధించిన ఇంటెన్స్, గ్రిప్పింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. చేతిలో పిస్టల్, టీషర్ట్, చేతులపై రక్తపు మరకలతో రైల్వే ప్లాట్ పై సంయుక్త కనిపించడం అదిరిపోయింది. రైల్వే స్టేషన్ అంతా శవాలతో నిండిపోయి, ఇంటెన్స్ ఫైట్ జరిగిందని సూచిస్తుంది. 'వెల్‌కమ్' అని రాసిన బోర్డు కింద సీలింగ్‌కి వేలాడుతున్న వ్యక్తి కనిపించడం పోస్టర్‌కి మరింత క్యురియాసిటీ పెంచింది. సంయుక్త ఇప్పటివరకు చూడని యాక్షన్ అవతార్‌లో చూపించబోతోందని ప్రామిస్ చేస్తోంది. సంయుక్తని దర్శకుడు యోగేశ్ నెవర్-సీన్-బిఫోర్ అవతార్‌లో చూపించే పవర్‌ఫుల్ స్క్రిప్ట్ రాశారు. ఆమె చేసిన హై-ఆక్టేన్ స్టంట్స్ ప్రేక్షకులను షాక్‌కి గురి చేయబోతున్నాయి. ప్రస్తుతం సినిమా హైదరాబాద్‌లో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. ఫస్ట్‌లుక్ పోస్టర్ ద్వారా మేకర్స్ ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం హిందీ భాషల్లో పాన్ ఇండియా విడుదల చేస్తున్నట్లు అనౌన్స్ చేశారు. ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే %-% దర్శకత్వం: యోగేష్, నిర్మాత: రాజేష్ దండా, సహ నిర్మాత: సింధు మాగంటి, డీవోపీ: ఎ.వసంత్, సంగీతం: సామ్ సిఎస్, ఎడిటర్: ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: సాహి సురేష్, కథ, డైలాగ్స్: యోగేష్, ప్రసాద్ నాయుడు, స్క్రిప్ట్ కో-ఆర్డినేటర్: మధు విప్పర్తి, యాక్షన్: రామ్ కృష్ణ, సాహిత్యం: రామజోగయ్య శాస్త్రి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిరణ్ పోపూరి.

## సరైన కంటెంట్‌తో వస్తే విజయం తథ్యం



'గతేడాది 'క' సినిమా సక్సెస్ సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నాను. ఇప్పుడు 'కె-ర్యాంప్' విజయోత్స వానికి వచ్చాను. డైరెక్టర్ నాని చేసిన కథకు మంచి ప్రొడ్యూసర్స్ దొరకడం, కిరణ్ లాంటి హీరో ఉండటం..అన్నీ కలిసి ఈ రోజు థియేట ర్స్‌లో ప్రేక్షకులు సినిమాను ఎంజారు చేస్తున్నా రు. నా సినిమాలు చూసి స్ఫూర్తిపొంది రాజేశ్ దండ ప్రొడ్యూసర్ అయ్యారు. రైట్ కంటెంట్‌ను తీసుకుని ఇన్వాల్వ్ అయి సినిమా నిర్మిస్తే ప్రేక్ష కులు తప్పకుండా విజయాన్ని ఇస్తారు. ఈ దీ పావళి బాక్సాఫీస్ కాంపిటీషన్‌లో ఈ సినిమా నెంబర్ నెం.1 నిలబడింది' అని నిర్మాత దిల్‌రాజు చెప్పారు.



## ఎదురులేని సఫారీలు

**- ప్రపంచకప్ నుంచి పాక్ నిష్క్రమణ**
**- 150 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా గెలుపు**
**- ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్**



**కొలంబో:**
ఐసీసీ మహిళల వన్డే వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అద్భుత జైత్రయాత్ర కొనసాగుతుంది. ప్రపంచకప్ చరిత్రలోనే ఆ జట్టు తొలిసారి వరుసగా ఐదు మ్యాచుల్లో విజయఢంకా మోగించింది. తొలి మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో ఓడిన సఫారీ అమ్మాయిలు.. ఆ తర్వాత వరుసగా ఐదు మ్యాచుల్లో అసమాన విజయాలు నమోదు చేశారు. మంగళవారం కొలంబోలో జరిగిన గ్రూప్ దశ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై దక్షిణాఫ్రికా అమ్మాయిలు 150 పరుగుల తేడాతో (డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో) తిరుగులేని విజయం సాధించారు. ఈ విజయంతో సెమీఫైనల్లో చోటుతో పాటు టాప్-2లో స్థానాన్ని దక్షిణాఫ్రికా అమ్మాయిలు ఖరారు చేసుకున్నారు. గ్రూప్ దశలో ఆరు మ్యాచులు ఆడినా.. ఒక్క విజయం సాధించని పాకిస్తాన్ అమ్మాయిలు మరో మ్యాచ్ ఉండగానే ప్రపంచకప్ నుంచి నిష్క్రమించింది.
వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో తొలుత దక్షిణాఫ్రికా అమ్మాయిలు 40 ఓవర్లలో 9 వికెట్లకు 312 పరుగులు చేశారు. ఓపెనర్ లారా (90, 82 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సులు), సునె లుస్ (61, 59 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్సులు), మరిజానె కాప్ (68 నాటౌట్, 43 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. పాక్ బౌలర్లలో సదియా ఇక్బాల్ (3/53), నష్రా సంధు (3/45) మూడు వికెట్లు పడగొట్టారు. పాకిస్తాన్ లక్ష్య ఛేదనకు వరుణుడు నిలకడగా అడ్డు తగిలాడు. దీంతో ఆ జట్టు లక్ష్యాన్ని డక్ వర్త్ లూయిస్ పద్ధతిలో 20 ఓవర్లలో 234 పరుగులుగా సవరించారు. సఫారీ బౌలర్లు మరిజానె కాప్ (3/20), షాంగసె (2/19) మెరువగా పాకిస్తాన్ బ్యాటర్లు తేలిపోయారు. 20 ఓవర్లలో పాకిస్తాన్ 7 వికెట్లకు 83 పరుగులే చేసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో దక్షిణాఫ్రికా 150 పరుగుల తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. ఆల్‌రౌండర్ ప్రదర్శనతో చెలరేగిన మారిజానె కాప్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

## పంత్ వచ్చేశాడు

**- వికెట్ కీపర్‌కు భారత్-ఏ కెప్టెన్సీ - దక్షిణాఫ్రికా-ఏతో సిరీస్‌కు జట్టు ఎంపిక**



**ముంబయి:** దక్షిణాఫ్రికా-ఏ జట్టుతో తలపడే రెండు మ్యాచుల రెడ్‌బాల్ సిరీస్‌కు స్టార్ వికెట్ కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ భారత-ఏ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఇంగ్లాండ్‌తో 'టెండూల్కర్-అండర్సన్' ట్రోఫీలో బ్యాటింగ్ చేస్తూ పాదం గాయానికి గురైన రిషబ్ పంత్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. బెంగళూర్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో రెండు దశల రిహాబిలిటేషన్‌లో రిషబ్ పంత్‌కు వైద్య బృందం ఫిట్‌నెస్ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో బీసీసీఐ సీనియర్ సెలక్షన్ కమిటీ రిషబ్ పంత్‌ను భారత్-ఏ సిరీస్‌కు తీసుకున్నారు.
స్వదేశంలో జరుగనున్న దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్‌లో రీ ఎంట్రీ ఆశిస్తున్న రిషబ్ పంత్.. సఫారీ-ఏ జట్టుతో సిరీస్‌లో ఫిట్‌నెస్, ఫామ్ నిరూపించుకోవాల్సి ఉంది. సఫారీ-ఏతో సిరీస్‌లో రిషబ్ పంత్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తే దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌కు పునరాగమనం లాంఛనమే కానుంది. భారత్, దక్షిణాఫ్రికా 'ఏ' జట్ల నాలుగు రోజుల మ్యాచులు బెంగళూర్‌లోని సీఓఈలో జరుగనుండగా.. రంజీ ట్రోఫీ రెండో రౌండ్‌లో ఢిల్లీ తరఫున ఆడేందుకు సిద్ధమైన రిషబ్ పంత్ ఇప్పుడు సొంత రాష్ట్ర రంజీ మ్యాచ్‌కు అందుబాటులో ఉండటం లేదు. భారత్-ఏ, దక్షిణాఫ్రికా-ఏ తొలి మ్యాచ్ అక్టోబర్ 30 నుంచి నవంబర్ 2 వరకు, రెండో మ్యాచ్ నవంబర్ 6 నుంచి 9 వరకు జరుగుతాయి. భారత్, దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ నవంబర్ 14న ఈడెన్‌గార్డెన్స్ టెస్టుతో ఆరంభం కానున్న సంగతి తెలిసిందే. భారత్-ఏ జట్టుకు పంత్ కెప్టెన్‌గా ఎంపికవగా.. బి. సాయి సుదర్శన్ వైస్ కెప్టెన్‌గా నియమితులయ్యాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న కెఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, ప్రసిద్ కృష్ణ, మహ్మద్ సిరాజ్‌లు సైతం సఫారీ-ఏతో రెడ్‌బాల్ మ్యాచ్‌లో ఆడనున్నారు. కంగారూ గడ్డ నుంచి స్వదేశం చేరుకున్న తర్వాత రెండో మ్యాచ్‌లో రాహుల్, ధ్రువ్, ప్రసిద్ కృష్ణ, సిరాజ్‌లు ఆడతారు. ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ జరుగుతున్న సమయంలో రాష్ట్ర జట్ల సమతూకం దెబ్బతినకుండా భారత్-ఏ జట్టును అజిత్ అగ్కార్ సారథ్యంలోని సెలక్షన్ కమిటీ ఈ క్రికెటర్లను కేవలం ఒక్క మ్యాచ్‌కే ఎంచుకున్నట్టు కనిపిస్తోంది. మంచి ఫామ్‌లో ఉన్న రజత్ పాటిదార్, రుతురాజ్ గైక్వాడ్, అభిమన్యు ఈశ్వరన్, ఆకాశ్ దీప్‌లను సెలక్షన్ కమిటీ భారత్-ఏకు ఎంపిక చేయలేదు. ఎన్ జగదీశన్, మానవ్ సుథర్, సురాన్ష్ జైన్, హర్ష్ దూబెలు దేశవాళీ ప్రదర్శనతో భారత్-ఏ జట్టులోకి ఎంపికయ్యారు.
**భారత్-ఏ జట్టు:** తొలి మ్యాచ్
రిషబ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), ఆయుశ్ మాత్రె, ఎన్ జగదీశన్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్, హర్ష్ దూబె, తనుశ్ కొటియన్, మానవ్ సుథర్, అన్షుల్ కంబోజ్, యశ్ ఠాకూర్, ఆయుశ్ బదొని, సరాన్ష జైన్, గుర్నూర్ బరార్, ఖలీల్ అహ్మద్.
**భారత్-ఏ జట్టు:** రెండో మ్యాచ్
రిషబ్ పంత్ (కెప్టెన్, వికెట్ కీపర్), కెఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్, హర్ష్ దూబె, తనుశ్ కొటియన్, మానవ్ సుథర్, ఖలీల్ అహ్మద్, గుర్నూర్ బరార్, అభిమన్యు ఈశ్వరన్, ప్రసిద్ కృష్ణ, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్.

## స్పిన్నర్లే 50 ఓవర్ల బౌలింగ్

**- బంగ్లాతో వన్డేలో విండీస్ రికార్డు**
**- సూపర్ ఓవర్లో కరీబియన్ల గెలుపు**



**ఢాకా:** కరీబియన్లు క్రికెట్‌లో కొత్త రికార్డు నెలకొల్పారు. భీకర పేస్‌కు పెట్టింది పేరు వెస్టిండీస్. కానీ మంగళవారం ఢాకాలో బంగ్లాదేశ్‌తో జరిగిన రెండో వన్డేలో విండీస్ ఏకంగా 50 ఓవర్లు స్పిన్ బౌలింగ్ చేసింది. పేస్ బౌలర్లను పక్కనపెట్టిన వెస్టిండీస్ పూర్తి కోటా ఓవర్లను స్పిన్నర్లకు అందించింది. బంగ్లాదేశ్ సైతం 50 ఓవర్లలో 42 ఓవర్లను స్పిన్నర్లకు అందించింది. దీంతో ఓ వన్డే మ్యాచ్‌లో 92 ఓవర్లు స్పిన్ బౌలింగ్ వేయటంతో కొత్త రికార్డు నమోదైంది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 213 పరుగులు చేసింది. సౌమ్య సర్కార్ (45), మెహిది హసన్ మిరాజ్ (32), రిషద్ హొస్సేన్ (39 నాటౌట్) రాణించారు. విండీస్ స్పిన్నర్లు మోటీ (3/65), అకీల్ (2/41), అలిక్ (2/14) మాయ చేశారు. ఛేదనలో విండీస్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 213 పరుగులు చేసింది. 133/7తో ఓటమి కోరల్లో కూరుకున్న కరీబియన్లు.. టెయిలెండర్లు జస్టిన్ గ్రీవ్ (26), అకీల్ (16) మెరుపులతో స్కోరు సమం చేసింది. 50 ఓవర్ల మ్యాచ్‌లో స్కోర్లు సమం కాగా.. మ్యాచ్ ఫలితం సూపర్ ఓవర్లో తేలింది. వెస్టిండీస్ తొలుత 6 బంతుల్లో 10 పరుగులు చేయగా.. ఛేదనలో బంగ్లాదేశ్ ఆరు బంతుల్లో ఓ వికెట్‌కు 9 పరుగులే చేసింది. ఒక్క పరుగుతో తేడాతో సూపర్ ఓవర్లో గెలుపొందిన వెస్టిండీస్.. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌ను సమం చేసింది.

# అమ్మా.. నాన్న ఎక్కడ..?

## తండ్రి చిత్రపటాన్ని చూసి చిన్నారుల ప్రశ్న

## కన్నీరుమున్నీరుగా విలపించిన తల్లి

## 14వ బెటాలియన్‌లో హృదయ విదారక ఘటన






**అనంతపురం క్రైమ్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** డ్యూటీ నుంచి వచ్చీరాగానే తమను ఎత్తుకొని ఆడించే నాన్న... పిల్లలు కనిపించగానే భుజాలపైకి ఎత్తుకొనే నాన్న... చాలా రోజుల నుండి కనిపించటం లేదని ...తన తండ్రి చిత్రపటాన్ని చూసి తన తల్లి ఎందుకు ఏడుస్తుందో అర్థంకాక అయోమయంగా చూస్తున్న ఆ చిన్నారులను చూసిన 14వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది కంటతడి పెట్టకుండా ఉండలేకపోయారు... అమ్మా...మరి నాన్న ఎక్కడ ఉన్నాడు...? అంకుల్స్ అందరూ ఉన్నారు నాన్న లేడు....! అంటూ అమాయకంగా అడిగే ఆ పిల్లాడికి ఏం సమాధానం చెప్పాలో తెలియక తన తల్లి తల్లడిల్లిపోయింది.. ఇదీ రెడ్ శాండల్ మాఫియా చేతిలో మృతి చెందిన బిల్లీ గణేష్ ( పి.సి 116) కుమారుడు పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవం నాడు తన తండ్రి చిత్రపటాన్ని చూస్తూ అమాయకంగా అడగడం చూసి... తన తండ్రి తోటి సిబ్బంది అందరిని కలిచివేసింది.

## శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో

# పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం









**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం "పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం"ను నిర్వహించారు. దేశ భద్రత, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన పోలీస్ సిబ్బందిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ "మన దేశ పోలీస్ సిబ్బంది ఎటువంటి కష్టసమయంలోనైనా ప్రజల భద్రత కోసం ముందుండి పనిచేస్తారు. ఉగ్రవాదులు, నేరస్తులు, విపత్తులు వంటి ఎన్నో ప్రమాదకర పరిస్థితుల్లో తమ ప్రాణాలను అర్పించి దేశ ప్రజలను రక్షిస్తున్నారు. అటువంటి అమరవీరుల త్యాగాలను మనమందరం గుర్తుంచుకోవాలి" అని అన్నారు. "అక్టోబర్ 21 తేదీ ప్రతి సంవత్సరం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటాం. 1959 లో లడాఖ్ ప్రాంతంలోని హాట్‌స్ప్రింగ్స్ వద్ద చైనా సైనికుల దాడిలో 10 మంది భారతీయ పోలీస్ సిబ్బంది వీరమరణం పొందారు. వారి త్యాగానికి గౌరవార్థం ఈ దినోత్సవం ఆరంభమైంది" అని వివరించారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు విద్యార్థిని విద్యార్థులు విరాళాల సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ మాట్లాడుతూ దేశ భద్రత మరియు దేశ ప్రజల కోసం విశ్రాంతి లేకుండా నిర్విరామంగా పోలీస్ శాఖ వారు సేవ చేస్తున్నారని వివరించారు. పోలీస్ విభాగం చేస్తున్న సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూ, "సమాజం అభ్యున్నతికి పోలీస్ సేవలు అపూర్వమైనవి. ప్రతి పౌరుడు పోలీసుల పట్ల గౌరవభావం కలిగి ఉండాలి" అని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీస్ అమరవీరుల ఆత్మ శాంతి కోసం ఒక్క నిమిషం మౌనంగా నిలబడి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటరమణ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ కె.రెడ్డయ్య, అధ్యాపకులు కే మురళీకృష్ణ, సునీత మరియు విద్యార్థిని మరియు విద్యార్థినివిద్యార్థులు పాల్గొన్నారు.

# సోలార్ ప్రాజెక్టు కోసం భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్





**అనంతపురం కలెక్టరేట్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21 :** సోలార్ ప్రాజెక్టు కోసం భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సోలార్ ప్రాజెక్టు కోసం భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంబదూరు మండలంలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్రాజెక్టు కోసం 5,276.81 ఎకరాల భూమిని గుర్తించగా, ఇందులో నెలకొన్న భూసమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 4,292.28 ఎకరాల గుర్తింపు పూర్తి కాగా, పెండింగ్ ఉన్న 984.53 ఎకరాల భూముల గుర్తింపు సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రాధాన్యతగా తీసుకుని భూసమస్యల పరిష్కరించాలని, పూర్తి అయిన భూములకు సంబంధించి లీజు అగ్రిమెంట్ కూడా చేపట్టాలన్నారు. వీలైనంత వరకు రైతులను ఒప్పించి భూ సేకరణ చేయాలని, సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. నెలాఖరు నాటికి మళ్లీ సమావేశం నిర్వహించడం జరుగుతుందని, అప్పటిలోగా భూముల గుర్తింపు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, సర్వే ఎడి రూప్లనాయక్, ఎపి ఎన్.జి.ఈ.ఎల్ (ఎన్.టి.పి.సి) డెవలప్మెంట్ అధికారి కిషోర్ రెడ్డి, ఎల్డిఎం నరేష్ రెడ్డి, కంబదూరు తహసీల్దార్ బాలకిషన్, ఎన్.టి.పి.సి అధికారులు శివకుమార్, వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గుత్తి మండలంలో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్టుపై గుంతకల్లు ఆర్డీఓ, గుత్తి తహసీల్దార్, తదితరులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గుత్తి మండలంలో ఏర్పాటు చేసే సోలార్ ప్రాజెక్టు భూముల గుర్తింపు సర్వే చేపట్టాలన్నారు. గుత్తి మండలంలోని బేతేపల్లి, ఊటకల్లు, ఊబిచర్ల, కరడికొండ, ధర్మపురం గ్రామాల పరిధిలో 2535.66 ఎకరాల భూమి గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాస్, గుత్తి తహసీల్దార్ పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్‌హెచ్ఆర్‌సీ నేషనల్ చైర్మన్ సంపత్ కుమార్‌కు సన్మానం

**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** బెంగళూరు లో జాతీయ మానవ హక్కుల మండలి ఎన్‌హెచ్ఆర్‌సీ రాష్ట్ర అధికారిక పరిపాలనా కార్యాలయాన్ని ప్రారంబించడానికి బెంగుళూరు విచ్చేసి హిందూపురం మీదుగా వెళుతున్న నేషనల్ చైర్మన్, ఫౌండర్ డాక్టర్ సంపత్ కుమార్ మరియు నేషనల్ జనరల్ సెక్రటరీ స్వప్న, కర్ణాటక రాష్ట్ర చైర్మన్ వెంకటేష్ లను హిందూపురం రైల్వే స్టేషన్ లో శాలువా, పూలమొక్క తో ఘనంగా సత్కరించి, సన్మానం చేశారు ఆఈ కార్యక్రమంలో రాయలసీమ చైర్మన్ బి. శ్రీధర్ మూర్తి (గోరంట్ల) ఎన్ హెచ్ ఆర్ సి రాయలసీమ అడిసనల్ జనరల్ సెక్రటరీ చంద్రమౌళి, రాయలసీమ కన్వీనర్ శ్రవణ్ కుమార్ (గోరంట్ల), సభ్యులు విజయ్ కుమార్, సభ్యులు ప్రవీణ్ కుమార్ లు సన్మానం చేశారు.

## శ్రీనివాస రైస్ మిల్లులో లక్ష్మీ పూజ



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** వైయస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు మారెంపల్లి మారెన్న కు చెందిన శ్రీనివాస రైస్ మిల్లులో మంగళవారం జరిగిన లక్ష్మీ పూజ కార్యక్రమంలో రాయదుర్గం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. మెట్టు గోవింద రెడ్డి మాట్లాడుతు లక్ష్మీదేవి ఆశీస్సులతో సిరిసంపదలు, అష్ట ఐశ్వర్యాలు లక్ష్మీదేవి ప్రసాదించాలని మెట్టు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులు హళ్లి నాగరాజు, వేమన, రాయదుర్గం మండల వైఎస్ఆర్సిపి రూరల్ కన్వీనర్ రామాంజనేయులు, రాయదుర్గం పట్టణ వైఎస్ఆర్సిపి కన్వీనర్ మేకల శ్రీనివాసులు, మండల కన్వీనర్ రవీంద్రరెడ్డితో పాటు వైఎస్ఆర్సిపి నాయకులు మురిడి మురళి, ఆధి సద్గురు చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యాసరచన, ఉపన్యాస పోటీలు



**అన్నమయ్య బ్యూరో, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** పోలీస్ అమర వీరుల స్మారక వారోత్సవం ను పురస్కరించుకొని జిల్లాలోని విద్యార్థులకు వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం ఉదయం డైట్ నందు ఆయన మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన ధీర పోలీస్ అమర వీరులను స్మరించుకునే ఉద్దేశ్యంతో ఈనెల 21వ తేదీ నుండి 31 వ తేదీ వరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరుగుతూ ఉందన్నారు. జిల్లా విద్యాశాఖ వారికి సహకరిస్తూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల లోని 8 నుండి 12వ తరగతి వరకు గల విద్యార్థులలో దేశభక్తి, సామాజిక బాధ్యత, చట్టపరమైన అవగాహనను పెంపొందించడానికి "లైంగిక దాడుల నుండి మహిళలు మరియు బాలల రక్షణలో విద్యార్థుల పాత్ర" అనే అంశంపై వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలు(1) డైట్, రాయచోటి, (2) జడ్పీ హైస్కూల్ , మదనపల్లి, (3) జడ్పీ హైస్కూల్, మన్నూరు, రాజంపేట నందు ఈనెల 23వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు . ఇందులో డివిజన్ వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి జిల్లాస్థాయిలో పోటీలను ఈనెల 26వ తేదీ జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించబడతాయన్నారు. అన్ని యాజమాన్యాలలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్చార్జ్ ప్రిన్సిపల్ మడితాడి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డీటీలో పోలీస్ శాఖ ప్రత్యేక దీపావళి వేడుకలు



**కనేకల్, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** పోలీసు సేవ అనేది కేవలం చట్టరక్షణకే పరిమితం కాకుండా, మానవతా విలువలను ప్రోత్సహించే వేదికగానూ నిలుస్తుందని మరోసారి రుజువైంది. అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ (ఐపీఎస్) ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రం దీపావళి పర్వదినం సందర్భంగా కణేకల్ మండలంలోని కణేకల్ క్రాస్ వద్ద ఆర్డీటీ ఆధ్వర్యంలో నడుస్తున్న బుద్ధిమాంద్య మరియు మానసిక వికలాంగ పిల్లల "మనోవికాస కేంద్రం"లో ప్రత్యేక దీపావళి వేడుకలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. పిల్లలతో సరదాగా గడిపి, వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ మాట్లాడుతూ, "పిల్లల చిరునవ్వులు చూసి మాకు ఎంతో ఆనందం కలిగింది. దీపావళి పండుగ యొక్క అసలు అర్థం ప్రేమ, ఆనందం పంచుకోవడమే" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగమధు, ట్రైనీ ఎస్ఐ నారాయణ రెడ్డి, ఆర్డీటీ హాస్పిటల్ ఇన్‌ఛార్జ్ డాక్టర్ దుర్గేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 150 మంది పిల్లలకు స్వీట్లు పంచి, వారితో కలిసి దీపాలు వెలిగించి, కాకరపూలు, చిచ్చుబుడ్లు, భూ చక్రాలు, కాకరవత్తులు వెలిగిస్తూ వారి ఆనంద క్షణాలను పంచుకున్నారు. పిల్లల సంరక్షకులు, వైద్య సిబ్బంది ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమం చేపట్టినందుకు జిల్లా ఎస్పీ పి. జగదీష్ (ఐపీఎస్) గారికి మరియు పోలీసు శాఖకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 (ASSOCIATE EDITOR -N.ARIF ALI ) CELL : 80740 10854

# దీపావళి సంబరాలు



**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ఎస్సీ ,ఎస్టీ, మరియు కేజీ.బీ.వీ వసతి గృహాలలో ఉన్న విద్యార్థులతో కలసి దీపావళి సంబరాలను సీఐ బోయ శేఖర్ ఆధ్వర్యం లో గోరంట్ల పోలీసులు జరుపుకున్నారు, జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ సంకల్పంతో గోరంట్ల సీఐ శేఖర్ తన సిబ్బందితో వెళ్లి ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలలో ఉన్న విద్యార్థులతో పాటు, కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్యార్థినిలతో కేక్ కట్ చేసి పిల్లలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియ జేశారు, స్వీట్లు పంచి పెట్టారు. పిల్లల మధ్య సంబరాలు జరుపుకుని వారి చేత టపాసులు కాల్పించి వారిలో సంతోషాన్ని నింపారు, దీపావళి పండుగకు గ్రామాలకు వెళ్లలేకుండా ఉన్న పిల్లలకు తామున్నమంటూ భరోసా కల్పిస్తూ కుటుంబసభ్యులు పాత్ర పోషించారు. దీపావళి పర్వదినాన విద్యార్థుల నడుమ ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపిన జిల్లా పోలీసుల తీరు పట్ల విద్యార్థులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా కృషి

## జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** జిల్లా కలెక్టర్ ఏ. శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగాసమన్వయంతో కృషి చేద్దామని జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులతో పేర్కొన్నారు. ఇటీవల నూతనంగా జిల్లా జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన మౌర్య భరద్వాజును... మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని తన చాంబర్లో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుగొండ ఆర్డీవోలు, రెవెన్యూ సిబ్బంది వివిధ శాఖల జిల్లా అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా మంత్రులు, శాసనసభ్యుల సహకారంతో.. అదేవిధంగా జిల్లా మంత్రులు ఎస్. సవితమ్మ, సత్య కుమార్ యాదవ్ మరియు శాసన సభ్యులందరి సహాయ సహకారాలతో కూడా జిల్లా అభివృద్ధికిపాటుపడతామని ఈ సందర్భంగా జేసి పేర్కొన్నారు,

# గౌనివారిపల్లిలో 'సూపర్ జీఎస్టీ'




**గోరంట్ల, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమా, చేనేత జౌళి శాఖ మంత్రి యస్. సవితమ్మ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సూపర్ జి ఎస్ టి- సూపర్ సేవింగ్స్ డోర్ టూ డోర్ కార్యక్రమం మంగళ వారం టీడీపీ మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణ చౌదరి ఆధ్వర్యంలో గోరంట్ల మండలం లోని గౌనివారి పల్లి గ్రామంలో డోర్ టూ డోర్ క్యాంపెయిన్ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ కమలా బాయి ,వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ వాల్మీకి తిరుపాల్, సింగిల్ విండో చైర్మన్ రవి మోహన్, మాజీ ఎంపీపీ నిమ్మల విద్య ధరణి, టీడీపీ మండల నాయకులు, నిత్యశ్రీ జ్యువెలర్స్ యజమాని నిమ్మల శ్రీధర్, మాజీ సర్పంచ్ నరేష్, సింగిల్ విండో మాజీ చైర్మన్ ఉత్తమ్ రెడ్డి, స్టోర్ డీలర్ నాగభూషణం,తెలుగుయువత మండల అధ్యక్షులు అచ్యుత్ చౌదరి,మాజీ డీలర్ రోహిత్, కమ్మల వాండ్ల పల్లి శ్రీనివాసులు,ప్రభాకర్ వేణు శీనపల్లి నాగరాజు గోవిందు, మామిడికాయల హరిప్రసాద్, కురుబ మహేంద్ర, కురుబ మల్లికార్జున, గంగిరెడ్డి యాదవ్, ప్రతాప్ నాయుడు ,వాల్మీకి రాఘవేంద్ర, కమ్మలవాండ్ల పల్లి అనిల్, గంగంపల్లి సుబహాన్ మరియు స్థానిక ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

## రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



**రాయచోటి, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ (08561-293006) ఏర్పాటు చేసినట్టుగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్ లో 24 గంటలు సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశామని, సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ ను పై ఫోన్ నెంబర్ కు సంప్రదించవచ్చని మంత్రి మడిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛన్ సంఘటనలు జరగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు

## మున్సిపాలిటీ కౌన్సిలర్ షబ్బీర్‌ను

# పరామర్శించిన వైసీపీ నేతలు



**నాయుడుపేట, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** ఇటీవల కంటికి శస్త్ర చికిత్స చేయుంచుకొని నాయుడుపేట పట్టణంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ షబ్బీర్ ను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రమణ్యరెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు పరామర్శించారు.అలాగే వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేష్ రెడ్డి ,పేర్నాటి రాహుల్, గందవల్లి.సిద్దయ్య,నెలవల రవి, రమణయ్య,షేక్ రహంతుల్లా పలువురు నాయకులు షబ్బీర్ ను పరామర్శించారు.

# ఆర్లపాడులో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



**పెళ్లకూరు, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం అర్ధమాల పంచాయతీ పరిధిలోని ఆర్లపాడు గ్రామంలో గిరిజనుల దయనీయ పరిస్థితి కంటతడి పెట్టిస్తోంది. గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గ్రామంలోని వీధులు చెరువులను తలపించేలా జలమయమయ్యాయి. వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలో సుమారు 50 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. రోజు కూలి పనుల మీదే ఆధారపడి జీవనం సాగించే ఈ శ్రమజీవులు, వర్షాల కారణంగా పనులు లేక పస్తులు ఉంటున్నామని చెబుతున్నారు. పాతకాలంలో ప్రభుత్వం నిర్మించిన ఇళ్లు ఇప్పుడు వర్షానికి తట్టుకోలేని పరిస్థితిలో ఉన్నాయి. వీధులు ఎత్తుగా మారిపోవడంతో ఏ చిన్న వర్షం కురిసినా ఇళ్లలోకి నీరు చేరి, వస్తువులు తడిసి ముద్దవుతున్నాయి. దీపావళి పండుగను చుట్టుపక్క గ్రామాల్లో హర్షోల్లాసంగా జరుపుకుంటున్న తరుణంలో, ఆర్లపాడు గిరిజన కుటుంబాలు మాత్రం "పోయే రాజేయలేని నీ పరిస్థితి" అంటూ కడుపునిండా భోజనం కూడా చేయలేని దుస్థితిని ఎదుర్కొంటున్నాయి. పిల్లలతో పాటు వృద్ధులు, మహిళలు నీటిలోనే రోజులు గడుపుతున్నారు. "మా బాధలు వినే వారు లేరు, నాయకులు ఎవరూ మాకు సహాయం చేయడం లేదు" అంటూ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల వల్ల నష్టపోయిన ఈ బడుగు వర్గాల ప్రజల సమస్యపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## భారీ వర్షాల నేపథ్యంలో

# అధికారులంతా అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ ఆదేశాలు జారీ



**పుట్టపర్తి, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** దక్షిణ పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో... నేటి నుండి రెండు రోజులపాటు రాయలసీమ ప్రాంతాల్లో... ముఖ్యంగా జిల్లాలో కొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు/ఈదురు గాలులతో కూడిన వర్షాలు, భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ ఇప్పుడే(మంగళవారం రాత్రి) తాజా సమాచారం తెలిపిందని మంగళవారం జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. గాలి వేగం గంటకు 35 నుంచి 45కిమీ వేగంతో, కొన్నిచోట్ల 55 కిమీ వరకు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు అందరూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ... తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైనప్పుడు అధికారుల సూచన మేరకు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలన్నారు. సంబంధిత మండల నియంత్రణ కేంద్రాల సిబ్బంది పూర్తి అప్రమత్తత ఉండాలని బలహీనమైన నిర్మాణాలపై తక్కువ ఎత్తున ప్రాంతాలపై మరియు ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. అలాగే తమ పరిధిలో వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితిలపై వెంటనే అధికారులకు ప్రజలకు సమాచారం అందించి సంబంధిత గ్రూపులో పరిస్థితిని అప్డేట్ చేయవలసిందిగా కూడా సూచించారు.

**కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ రూమ్.....**

ఏపీ విపత్తుల నిర్వహణ శాఖ సూచనల మేరకు... జిల్లా కేంద్రం పుట్టపర్తి కలెక్టరేట్ నందు 08555-289039 నంబరు తో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారాన్ని కమాండ్ కంట్రోల్ రూమ్ కు తెలియజేయవచ్చునని పేర్కొన్నారు. అలాగే డివిజన్ లలో ఆర్డీవో కేంద్రాలలో కూడా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాసిల్దార్లు వారి ప్రధాన మండల కేంద్రాలలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. వాతావరణ శాఖ సూచనలు అనుసరించి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## దొరవారిసత్రం మండలంలో

# పలు గ్రామాలు జలమయం





**దొరవారిసత్రం, సూర్య వాస్తవం, అక్టోబర్ 21:** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలంలోని పలు గ్రామాలు జలమయమయ్యాయి. వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తపల్లి కొత్త హరిజనవాడ, ఉచ్చూరు, కట్టువాపల్లి హరిజనవాడ గ్రామాల్లో వర్షపు నీరు ఇండ్లలోకి చొరబడింది. కొంతమంది గ్రామస్తులు తమ ఇళ్లలోకి వచ్చిన నీటిని తొలగించే పనిలో నిమగ్నమై ఉండగా, మరికొందరు నీటిమీద మంచాలు వేసుకుని చలికి వణుకుతూ రాత్రులు గడుపుతున్నారు. వీధులన్నీ బురద బురదగా మారి, ప్రజలు ఇంట్లోనూ ఉండలేని పరిస్థితి నెలకొంది. "ఎన్ని ప్రభుత్వాలు మారినా మా హరిజనవాడ పరిస్థితి మాత్రం మారలేదు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య ఎదురవుతోంది. ఎన్నికల సమయంలో నాయకులు హామీలు ఇస్తారు కానీ అమలు చేయరు," అని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉచ్చూరు గ్రామంలో వీధులన్నీ వర్షపు నీటితో నిండిపోవడంతో పిల్లలు స్కూల్‌కి వెళ్లడం కూడా కష్టంగా మారింది. "పిల్లలు చెరువులో నడుస్తున్నట్టుగా స్కూల్‌కి వెళ్తున్నారు," అని తల్లిదండ్రులు తెలిపారు. కట్టువాపల్లి హరిజనవాడలోనూ ఇదే దృశ్యం కనిపిస్తోంది. రాత్రిపూట దోమల దెబ్బకు ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామస్తులు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ పాలకులు వెంటనే స్పందించి వీధులలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా కాల్వలు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

